ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 152 గురువారం 21 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 152 Thursday 21 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## ఏడాది తర్వాత
# మళ్లీ కలవనున్న మోదీ, ట్రంప్..


- ఫ్రాన్స్‌లో జరగనున్న జీ7 సదస్సుకు ప్రత్యేక అతిథిగా ప్రధాని మోదీకి ఆహ్వానం
- ఏడాది తర్వాత మళ్లీ డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం
- గతేడాది భారత్-పాక్ కాల్పుల విరమణ క్రెడిట్‌పై ఇరు నేతల మధ్య పెరిగిన దూరం
- నోబెల్ శాంతి బహుమతి కోసమే ట్రంప్ వ్యాఖ్యలు చేశారని అప్పట్లో విమర్శలు



**వార్త సంధ్య, ఢిల్లీ, మే 20 :** ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర ఆసక్తి రేకెత్తించే అతికొద్ది సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల భేటీ ఒకటి. గతేడాది వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాల తర్వాత ఇప్పుడు మళ్లీ వారిద్దరూ ముఖాముఖి కలుసుకునే అవకాశం కనిపిస్తోంది. ఫ్రాన్స్‌లో వచ్చే నెలలో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సు - మిగతా 2 లో

## అద్భుతమైన విషయాన్ని కనిపెట్టిన చంద్రయాన్ ల్యాండర్.. సీక్రెట్‌గా ఉంచిన ఇస్రో!

- మిషన్ చివర్లో అరమీటర్ పైకి లేచిన ల్యాండర్
- రాకెట్ మంటల ధాటికి కొట్టుకుపోయిన చందమామ పైపొర
- చంద్రుడిపై నేల పొరలుగా ఉందని అంచనా
- మూన్ బేస్ నిర్మాణానికి ఈ డేటా కీలకం



**వార్త సంధ్య, ఢిల్లీ, మే 20 :** భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ ముగిసినా సరికొత్త అద్భుతాలను బయటపెడుతూనే ఉంది. 'శివశక్తి పాయింట్' వద్ద విక్రమ్ ల్యాండర్ చేసిన ఒక చిన్న ప్రయోగం ఇప్పుడు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. - మిగతా 2 లో

## 'వర్క్ ఫ్రమ్ హోమ్' అని చెప్పి- తెల్లవారుజామున 8వేలమందిని తీసేసిన 'మెటా'




- మెటా, లింక్డ్ ఇన్ సంస్థల్లో భారీగా ఉద్యోగ కోతలు
- సింగపూర్ హబ్‌లోని ఉద్యోగులకు తెల్లవారుజామున 4 గంటలకే మెయిల్స్ పంపిన మెటా
- అనంతరం మిగతా దేశాల్లోని వారికి మెయిల్స్
- 600 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించిన లింక్డ్ ఇన్

**వార్త సంధ్య, ఢిల్లీ, మే 20 :** : టెక్ దిగ్గజం 'మెటా' మరోసారి భారీ లేఆఫ్స్‌ను ప్రకటించింది. అయితే, ఈసారి ఉద్యోగులను తొలగించిన విధానం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మొత్తం వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 10శాతం అంటే సుమారు 8వేల మంది - మిగతా 2 లో

## మధ్యాహ్నం వేళ
# ప్రయాణాలు మానుకోండి

- తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటు లో ఉంచాలన్న సీఎం
- వడదెబ్బకు గురైన వారికి తక్షణ వైద్యం అందించేలా వైద్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశం



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 20 :** తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పులపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యం గా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణో గ్రతలు నమోద వుతున్నాయన్న వాతా వరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సీఎం స్పందించారు. జిల్లాల్లో మారుతున్న పరిస్థితులను - మిగతా 2 లో

### విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ ఆర్ బీఎం మినహాయింపు ఇవ్వండి



- వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రితో భట్టి చర్చ
- ఎస్ ఏఎస్ సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి
- యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరణ

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 20 :** ఢిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. ఆపై ఎస్ ఏఎస్ సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. - మిగతా 2 లో

## తమిళ రాజకీయాల్లో కీలక పరిణామాలు..
# విజయ్ కేబినెట్‌లో చేరనున్న వీసీకే!



- విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో చేరే అంశంపై వీసీకే సానుకూలత
- ఏఐఏడీఎంకే రెబల్స్‌ను కేబినెట్‌లోకి తీసుకోబోమని టీవీకే స్పష్టమైన హామీ
- మంత్రి పదవులపై వీసీకేలో మొదలైన అంతర్గత చర్చలు
- అధికారంలో భాగస్వామ్యం తమ చిరకాల రాజకీయ ఆకాంక్ష అని తెలిపిన తిరుమావళవన్
- సీనియర్ నేతలతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటన

**వార్త సంధ్య, చెన్నై, మే 20 :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వంలో చేరేందుకు విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) సుముఖత వ్యక్తం చేసింది. మంత్రివర్గంలో చేరాలంటూ టీవీకే నుంచి మరోసారి అందిన ఆహ్వానంపై తమ పార్టీలో చర్చిస్తామని వీసీకే అధ్యక్షుడు థోల్ తిరుమావళవన్ సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ పరిణామంతో త్వరలోనే విజయ్ కేబినెట్‌లో వీసీకేకు చోటు - మిగతా 2 లో

### ఇక బయోమెట్రిక్ అక్కర్లేదు.. రేషన్ పంపిణీపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన



- ఏపీలో రేషన్ పంపిణీకి డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) విధానం అమలు
- విజయవాడ, విశాఖపట్నంలలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు సన్నబియ్యం బదులు స్టీమ్డ్ రైస్
- 2 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం కొనుగోలుకు కేంద్రం అంగీకారం

**వార్త సంధ్య, అమరావతి, మే 20 :** ఏపీలో రేషన్ పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఇప్పటివరకు ఉన్న విధానానికి భిన్నంగా, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. - మిగతా 2 లో

### టీడీపీ మహానాడులో ఏపీ, తెలంగాణతో పాటు.. అండమాన్ కు సంబంధించిన తీర్మానం

- మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ముగిసిన మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం
- మహానాడులో 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని నిర్ణయం
- కూటమి ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్న సోమిరెడ్డి




2 లో

### 'మ్యాజిక్ డ్రెయిన్స్'ని మరిన్ని గ్రామాల్లో నిర్మించాలి



- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతో సమీక్షలో పవన్
- పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, శ్మశాన వాటికలను సర్వే చేయండి
- ఉపాధి హామీ పనులను మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలి
- 'పల్లెపండుగ' రెండో దశలో 3,580 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

## బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ తన లక్ష్యం

- నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ పై అధికారులు దృష్టిసారించాలి
- ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంత బిడ్డల్లా భావించి పనిచేయాలి
- ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్
- డీఈవోలు, ఏపీసీలతో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమావేశం



**వార్త సంధ్య, అమరావతి, మే 20 :** "దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం. అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నాను. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనా పద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తాం" అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఏపీసీలతో(అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, క్వాలిటీ మెరుగుపర్చకపోతే నష్టపోయేది పిల్లలే అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్ తో పోటీపడాలన్నారు. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు - మిగతా 2 లో

# ఇక బయోమెట్రిక్ అక్కర్లేదు..
# రేషన్ పంపిణీపై మంత్రి నాదెండ్ల కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి -** ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గుజరాత్‌లోని నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఈ విధానాన్ని, త్వరలోనే రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నంలలో కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సీబీడీసీ విధానం ప్రకారం.. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ వ్యాలెట్ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ డబ్బును డిజిటల్ రూపాయి రూపంలో నేరుగా లబ్ధిదారుల వ్యాలెట్‌కు జమ చేస్తుంది. లబ్ధిదారులు ఆ డిజిటల్ డబ్బుతో రేషన్ దుకాణాల్లో తమకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేయవచ్చు. ఈ విధానంలో బయోమెట్రిక్ అవసరం కూడా ఉండదు. దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ ఎంత వస్తుందో లబ్ధిదారులకు, తమ మార్జిన్ ఎంత వస్తుందో డీలర్లకు స్పష్టత ఉంటుందని మంత్రి వివరించారు. రేషన్ పంపిణీతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కింద ఇకపై సన్న బియ్యానికి బదులుగా నాణ్యమైన స్టీమ్డ్ రైస్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారన్నారు. అలాగే, రాష్ట్రం నుంచి 2 లక్షల టన్నుల ఉప్పుడు బియ్యం కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఇవేకాకుండా, వినియోగదారులకు తక్కువ ధరలకే నిత్యావసరాలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మినీమార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఏపీకి గర్వకారణమైన అరకు కాఫీని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మిలటరీ క్యాంటీన్లలో విక్రయించేందుకు ఎన్‌సీసీఎఫ్ అంగీకరించిందని మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.

# 'వర్క్ ఫ్రమ్ హోమ్' అని చెప్పి- తెల్లవారుజామున 8వేలమందిని తీసేసిన 'మెటా'

**మొదటిపేజీ తరువాయి -** ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మెటా ప్రకటించింది. ఈ ప్రక్రియను వ్యూహాత్మకంగా అమలు చేసింది. అమెరికా, బ్రిటన్‌తో సహా పలు దేశాల్లోని ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేయాలని సూచించింది. ఆ తర్వాత టైమ్ జోన్ల ఆధారంగా ఉద్యోగులకు లేఆఫ్ మెయిల్స్ పంపించింది. ఉదయం 4 గంటలకే మెయిల్స్ మొదట సింగపూర్ హబ్‌లోని ఉద్యోగులకు తెల్లవారుజామున 4 గంటలకే ఉద్యోగం నుంచి తీసేసినట్లు మెయిల్స్ వెళ్లాయి. ఆ తర్వాత మిగతా దేశాల్లోని వారికి లేఆఫ్స్ మెయిల్స్ అందాయి. కార్యాలయాల్లో ఉద్రిక్తతల నివారణకు మెటా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో మరో 7 వేల మంది ఉద్యోగులను ఏఐ ఆధారిత విభాగాలకు బదిలీ చేయనుంది. అయితే, భవిష్యత్ లో ఏఐకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మెటా నిర్ణయించినట్లు తెలుస్తోంది. మెటా సంస్థ ఈ ఉద్యోగులను నాలుగు కొత్త ఏఐ కేంద్రిత విభాగాల్లో పునర్వ్యవస్థీకరించనుంది. కంపెనీ అంతర్గతంగా ఏప్రిల్ నెలలో విడుదలైన మెమోలో ఈ విషయాలను ఇప్పటికే వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మరోవైపు, మెటా హెడ్ ఆఫ్ పీపుల్ 'జానెల్ గేల్' ఈ మార్పులపై మెమోలో ఈ విధంగా పేర్కొన్నారు. 'సంస్థను మరింత సమర్థవంతంగా నడిపించేందుకు, ఏఐ రంగంలో పెట్టుబడులను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. ఇది సులభమైన నిర్ణయం కాదు. సంస్థకు ఎంతో సేవలందించిన ఉద్యోగులను విడిచిపెట్టాల్సి రావడం బాధాకరం' అని ఆమె పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఏఐ సామర్థ్యాల పెంపుపైనే ప్రధానంగా దృష్టి : ఇక, మెటా చేపడుతున్న ఈ మార్పులు కేవలం ఉద్యోగ కోతలకే పరిమితం కావడం లేదు. సంస్థలో ఖాళీగా ఉన్న దాదాపు 6 వేల పోస్టులను కూడా భర్తీ చేయకుండా నిలిపివేయనున్నట్లు సమాచారం. అంటే సంస్థ ఇప్పుడు నియామకాల కంటే ఏఐ సామర్థ్యాల పెంపుపైనే దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం మెటా పరిధిలోని ఫేస్ బుక్ , ఇన్ స్టాగ్రామ్ , వాట్సాప్ వంటి ప్రధాన ప్లాట్‌ఫారమ్‌లలో ఏఐ వినియోగాన్ని మరింత విస్తరించేందుకు కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మెటా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సుసాన్ లీ ఇటీవల జరిగిన 2026 తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సమావేశంలో మాట్లాడారు. ఏఐ టూల్స్ ద్వారా ఉద్యోగుల ఉత్పాదకతను, ఇంజినీరింగ్ సామర్థ్యాన్ని పెంచడంపై సంస్థ దృష్టి పెట్టిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఏఐ కోసం భారీ పెట్టుబడులు పెట్టేందుకు కూడా మెటా ముందుకొచ్చింది. ఇప్పటికే 2026 సంవత్సరానికి కంపెనీ మూలధన వ్యయాల అంచనాలను మెటా పెంచింది. మొదట 115 బిలియన్ డాలర్ల నుంచి 135 బిలియన్ డాలర్ల మధ్య ఖర్చు చేస్తామని ప్రకటించిన సంస్థ, ఇప్పుడు ఆ అంచనాను 125 బిలియన్ డాలర్ల నుంచి 145 బిలియన్ డాలర్లకు పెంచింది. ముఖ్యంగా డేటా సెంటర్ల విస్తరణ, ఏఐ కోసం అవసరమైన అధునాతన కంపోనెంట్ ధరలు పెరగడం ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది. ఇదిలా ఉండగా, మెటాలో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు కూడా గణాంకాలు చెబుతున్నాయి. 2022లో కంపెనీలో 86,482 మంది ఉద్యోగులు ఉండగా, 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 77,986కు తగ్గింది. 606 మంది ఉద్యోగులకు శాశ్వత లేఆఫ్ ప్రకటించిన 'లింక్డ్ ఇన్' ఇక మరో టెక్ దిగ్గజం లింక్డ్ ఇన్ కూడా ఉద్యోగ కోతల దిశగా అడుగులు వేసింది. న్యూయార్క్ పోస్ట్ నివేదిక ప్రకారం, కంపెనీ 606 మంది ఉద్యోగులకు శాశ్వత లేఆఫ్ నోటీసులు జారీ చేసింది. ఈ తొలగింపులు జులై 13 నుంచి అమల్లోకి రానున్నట్లు సమాచారం.

# ఏడాది తర్వాత మళ్లీ కలవనున్న మోదీ, ట్రంప్..

**మొదటిపేజీ తరువాయి -** ఈ కలయికకు వేదిక కానుంది. ఈ భేటీతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గుతాయో లేదోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. జూన్ 15 నుంచి 17 వరకు ఎవియన్-లెస్-బెయిన్స్‌లో జరిగే ఈ సదస్సులో జీ7 సభ్య దేశాలు కాకపోయినా, ప్రత్యేక ఆహ్వానిత దేశంగా భారత్ పాలుపంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్‌ల మధ్య అధికారికంగా కాకపోయినా, కనీసం అనధికారికంగానైనా ఒక చిన్న సమావేశం (పుల్-అసైడ్ మీటింగ్) జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ అనూహ్య శైలిని బట్టి చూస్తే, ఈ భేటీని కొట్టిపారేయలేం. మోదీ, ట్రంప్ చివరిసారిగా 2025 ఫిబ్రవరిలో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఆయన్ను కలిసిన తొలి ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు. ఆ సమయంలో మోదీని తన "గొప్ప స్నేహితుడు" అని అభివర్ణించిన ట్రంప్, 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఆ తర్వాత కొద్ది నెలలకే మే నెలలో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో తానే కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించుకున్నారు. నోబెల్ శాంతి బహుమతిని ఆశించి, తాను వాణిజ్యపరమైన బెదిరింపులతోనే అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధాన్ని ఆపానని ప్రతిచోటా ప్రచారం చేసుకున్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు పాకిస్థాన్ వంత పాడగా, భారత్ మాత్రం తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఇస్లామాబాద్‌తో నేరుగా జరిపిన చర్చల ఫలితమేనని, ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏడాది తర్వాత జరగబోయే ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# అద్భుతమైన విషయాన్ని కనిపెట్టిన చంద్రయాన్ ల్యాండర్.. సీక్రెట్‌గా ఉంచిన ఇస్రో!

**మొదటిపేజీ తరువాయి -** జాబిల్లి నేల గురించి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థ నాసా సైతం అబ్బురపడే విషయాలు ఇస్రో ద్వారా వెలుగులోకి వచ్చాయి.

### అనుకోకుండా చిన్న జంప్

చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్ తన ప్రయోగాలు పూర్తి చేసుకునే సమయానికి దానిలో కొంత ఇంధనం మిగిలింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు ముందుగా ప్లాన్ చేయని ఒక సాహసం చేశారు. ఇంజిన్లను మళ్లీ మండించి విక్రమ్‌ను చంద్రుడి ఉపరితలం నుంచి 50 సెంటీమీటర్ల పైకి లేపి పక్కకు కాస్త దూరంలో ల్యాండ్ అయ్యేలా చేశారు. టెక్నాలజీ పరంగా ఇది భారత్‌కు ఒక పెద్ద విజయమైనా సైంటిఫిక్‌గా అంతకంటే పెద్ద రహస్యం దీనివల్ల బయటపడింది.

### కొట్టుకుపోయిన పైపొర

ల్యాండర్ ఇంజిన్లు మళ్లీ మండటంతో ఆ మంటల ధాటికి చంద్రుడిపై ఉన్న 3 సెంటీమీటర్ల పైపొర గాల్లోకి లేచింది. పైన ఎంతో మెత్తగా, దూదిలా ఉండే పొడి మట్టి తొలగిపోవడంతో.. దాని కింద ఎప్పుడూ ఎండ తగలని సరికొత్త మట్టి పొరలు ల్యాండర్‌లోని చాస్టే పరికరానికి చిక్కాయి. ఇలా ఎలాంటి డ్రిల్లింగ్ మిషన్ లేకుండానే చంద్రుడి అంతర్భాగంలో ఉన్న మట్టిని పరిశీలించే అరుదైన అవకాశం శాస్త్రవేత్తలకు దొరికింది.

### చందమామ నేల 'కేక్' లాంటిది

ఈ ప్రయోగం ద్వారా వచ్చిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు చంద్రుడి ఉపరితలం 'కేక్'లా పొరలు పొరలుగా ఉందని తేల్చారు. పైన ఉండే మట్టి ఎంతో వదులుగా, పొడి పిండిలా ఉంటే.. కేవలం 6 సెంటీమీటర్ల లోతులోనే అది తడి జిగురు మట్టిలా చాలా గట్టిగా మారిపోతోంది. అంటే తక్కువ దూరంలోనే నేల స్వభావం పూర్తిగా మారిపోతోందని స్పష్టమైంది. ఈ రకమైన వైవిధ్యం గతంలో అమెరికా అపోలో మిషన్లు వెళ్లిన భూమధ్యరేఖ ప్రాంతంలో ఎక్కడా కనిపించలేదు.

### నాసాకు ఎలా ఉపయోగపడుతుంది?

నాసా తన ప్రతిష్ఠాత్మక 'ఆర్టెమిస్' మిషన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై మనుషులను దించి అక్కడ శాశ్వత స్థావరాలను నిర్మించాలని చూస్తోంది. చందమామ ఇలా మారుతుందని ఇస్రో కనిపెట్టడం వల్ల.. అక్కడ భవిష్యత్తులో ఇళ్లు కట్టాలన్నా, దిగాలన్నా ఈ పొరల స్వభావం ఎంతో ముఖ్యం. పైగా ఈ పొరలే చంద్రుడి లోపల ఉన్న మంచు గడ్డకట్టేలా కాపాడుతున్నాయని తెలియడంతో భవిష్యత్ మిషన్లకు ఇదొక గైడ్‌లా మారబోతోంది

# దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

**మొదటిపేజీ తరువాయి -** తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ తన లక్ష్యమని, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

బిడ్డల భవిష్యత్తు కేంద్రంగా నిర్ణయాలు

"ఈ సమావేశం కేవలం సమీక్ష కోసం కాదు. యాక్షన్ ప్లాన్ కోసం ఏర్పాటు చేశాం. నేను విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఏ పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారో రాష్ట్రస్థాయి విజిబిలిటీ, కనీస డేటా అందుబాటులో లేదు. పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేసినప్పుడే నేను కేవలం మూడునెలల్లో పూర్తిస్థాయి సమాచారంతో డ్యాష్ బోర్డు తయారుచేశాం. విద్యాశాఖలో కనీస డేటా బేస్ అందుబాటులో లేని పరిస్థితి నుంచి విద్యాశాఖలో నా ప్రయాణం ప్రారంభించాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మన సొంత బిడ్డల్లా భావించి నిర్ణయాలు తీసుకోవాలి. మనం తీసుకునే నిర్ణయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. బిడ్డల భవిష్యత్ కేంద్రంగా నిర్ణయాలు ఉండాలి. డ్యాష్ బోర్డు ప్రకారం యాక్షన్ ప్లాన్ దిశగా డీఈవోలు, ఏపీసీలు పనిచేయాలి. రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది పిల్లలు డ్రాపవుట్స్ గా ఉన్నారు. నెవర్ ఎన్ రోల్డ్ పై కూడా ఫోకస్ చేయాలి. నూరుశాతం ఎన్ రోల్ మెంట్ పై అధికారులంతా దృష్టిపెట్టాలి. యువగళం పాదయాత్ర సమయంలో నేను కర్నూలు జిల్లాలో పర్యటించేటప్పుడు వలస కార్మికుల కష్టాలను కళ్లారా చూశాను. ఎట్టిపరిస్థితుల్లో పిల్లలు పొలం పనులకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు. ఈ విషయంలో ప్రాపర్ ట్రాక్ మెకానిజం ఉండాలి" అన్నారు.

ఉద్యమంలా జీఎఫ్ఎల్ఎన్ చేపట్టాలి

"లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్ ను ఒక ఉద్యమంగా అమలుచేయాలి. వాస్తవాలు తెలుసుకున్నపుడే సరైన నిర్ణయాలు తీసుకోగలం. నిజం చేదుగా, అబద్ధంగా తీయగా ఉంటుంది. వాస్తవాన్ని అంగీకరిస్తేనే మన ప్రయాణం సరైన దిశగా సాగుతుంది. మేం సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే మీరు సరైన సమాచారం ఇవ్వాలి. ప్రస్తుతం 9వ తరగతికి క్లిక్కర్ టెక్నాలజీ అమలు చేస్తున్నాం. క్రోమ్ బుక్స్ అందించబోతున్నాం. నూరుశాతం జీఎఫ్ఎల్ఎన్ సాధనే లక్ష్యంగా పనిచేయాలి. 5 శాతం వెనుకబడటం అంటే సాధారణమైంది కాదు. వాస్తవంలో అది లక్షల సంఖ్యలో ఉంటుంది. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 10శాతం ఎన్ రోల్ మెంట్ ఇంప్రూవ్ చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకోసం సమిష్టిగా పనిచేయాలి" అన్నారు.

ఆత్మవిశ్వాసం నింపిన విద్యాశాఖ ప్రకటన

ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్, ప్రతిభావంతమైన టీచర్లు ఉన్నారని, పదోతరగతి ఫలితాలపై ఇటీవల తొలిసారి ప్రభుత్వమే యాడ్ ఇచ్చిందని తెలిపారు. అది పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపిందని అన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనకు వందరోజుల ప్రణాళిక బాగా ఉపకరించిందని అన్నారు. అది అవసరం లేకుండానే ట్రాన్సిషన్ జరగాలని, ఫౌండేషన్ పకడ్బందీగా ఉండాలని, దానిపై అధికారులంతా శ్రద్ధ వహించాలని సూచించారు.

రెండేళ్లలో రాష్ట్రమంతటా స్మార్ట్ కిచెన్లు

"రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ స్కూళ్ల మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్ ప్రవేశపెట్టాం. దీనిపై అధికారులు ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది. క్రిటికల్ ఇన్ ఫ్రా కోసం ప్రభుత్వం నుంచి నిధులిస్తున్నాం. ఇందుకోసం అవసరమైతే దాతల సహకారం తీసుకోండి. ప్రతి పాఠశాలకు లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింటింగ్స్, డ్రింకింగ్ వాటర్, టాయ్ లెట్, బెంచిలు కచ్చితంగా ఉండాలి. బేసిక్ ఇన్ ఫ్రా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలన్నదే మా ధ్యేయం. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కడపలో స్మార్ట్ కిచెన్ అద్భుతంగా చేశారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రం మొత్తం స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం" అని అన్నారు.

ఇంటర్నేషనల్ స్కూలుగా నిడమర్రు పాఠశాల

మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు స్కూలును ఇంటర్నేషనల్ స్కూలుగా తీర్చిదిద్దుతున్నామని లోకేశ్ తెలిపారు. అక్కడ తొలిసారి నో అడ్మిషన్ బోర్డు పెట్టారని అన్నారు. నెల్లూరులో కూడా రెండు స్కూల్స్ ను మంత్రి నారాయణ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక పాఠశాలను మోడల్ స్కూలుగా తీర్చిదిద్దాలని అధికారులను కోరుతున్నానని అన్నారు.

అమెరికాలో స్కూల్ డిస్ట్రిక్ట్ అనే కాన్సెప్ట్ అమలులో ఉందని అన్నారు. నిడమర్రులో మనం కల్పించిన అత్యుత్తమ సౌకర్యాల వల్ల పక్క నియోజకవర్గాల వారు కూడా ఈ నియోజకవర్గానికి తమ బిడ్డల అడ్మిషన్ కోసం నివాసం మార్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇదే పరిస్థితి కల్పించే లక్ష్యంతో పనిచేయాలని అన్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

బోధనపైనే ఉపాధ్యాయులు దృష్టిపెట్టాలి

"నేను విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక అనేక సంస్కరణలు తెచ్చా. ఉపాధ్యాయులు బోధనపైనే దృష్టిపెట్టాలి. అధికారులు అడ్మినిస్ట్రేషన్ పై శ్రద్ధ వహించాలి. లీప్ యాప్ ద్వారా పనివిధానాన్ని మెరుగుపర్చుకోవాలి. గతంలో విజిబిలిటీ లేకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు మొత్తం విధానానికి లీప్ యాప్ కేంద్రంగా ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, మండల, స్కూలు స్థాయిలో ఒకేవిధమైన డేటా ఉండాలి. లక్ష్యసారూప్యత ఉండాలి. డ్యాష్ బోర్డుపై శ్రద్ధపెట్టాలి. ఇదంతా పూర్తయ్యాక పబ్లిక్ డ్యాష్ బోర్డుకు యాక్సెస్ ఇస్తాం. పాల్, ఏఐ బేస్ లెర్నింగ్, ఏఐ ట్యూటర్ త్వరలోనే అమలు చేయబోతున్నాం" అని అన్నారు.

నైతిక విలువలు ముఖ్యం

టెక్నాలజీతోపాటు నైతిక విలువలు చాలా అవసరమని అన్నారు. అందుకే చాగంటి కోటేశ్వరరావు గారికి కేబినెట్ హోదాతో అడ్వయిజర్ గా పెట్టామని తెలిపారు. ప్రతి శనివారం వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్ పై దృష్టిపెట్టాలని అన్నారు. ఒక సోషల్ మీడియా పోస్టులో కొడుకు తల్లిని చంపే పరిస్థితి చూశానని, నైతిక విలువల బోధనతో ఇటువంటి ఘటనలను నివారించే అవకాశముందని అన్నారు. విద్యాశాఖపై పవిత్రమైన బాధ్యత ఉందని అన్నారు. జెండర్ సెన్సిటివిటీ కూడా చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎక్స్ పోజర్ విజిట్స్ ఏర్పాటు చేస్తున్నామని, యోగా, స్పోర్ట్స్ పై శ్రద్ధ పెడుతున్నామని వెల్లడించారు. స్పోర్ట్స్ కిట్స్ ఇస్తున్నామని, శాప్ ద్వారా స్పోర్ట్స్ కాంపిటీషన్స్ పెడుతున్నామని అన్నారు. విద్యాశాఖ వద్దని చాలామంది తనను వారించినా సమాజంలో తాను ఆశించిన మార్పు విద్యతోనే సాధ్యమని నమ్మి ఈ శాఖను తీసుకున్నానని అన్నారు. నూరుశాతం ఫలితాలు సాధించినపుడే విద్యాశాఖ మంత్రిగా సంతృప్తి చెందుతానని వ్యాఖ్యానించారు. అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ పై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించాల్సిన పవిత్ర బాధ్యత మనందరిపై ఉందని మంత్రి లోకేశ్ చెప్పారు.

రెండేళ్లలో విద్యావ్యవస్థలో అనూహ్య మార్పులు

హెచ్‌ఆర్‌డీ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ, పాఠశాల విద్య భవిష్యత్ కార్యాచరణ గురించి ఈ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. గత రెండేళ్లలో పాఠశాల విద్యావ్యవస్థలో మునుపెన్నడూ చూడని సంస్కరణలు చూసినట్లు చెప్పారు. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని అన్నారు. అనేకసార్లు మంత్రి లోకేశ్ రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షించి దశ, దిశ నిర్దేశించినట్లు చెప్పారు. ఒక్కోసారి ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సమావేశాలు నిర్వహించారని తెలిపారు. వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు నిరంతరం చర్చలు జరిపారని అన్నారు. రెండేళ్లలో విద్యాశాఖలో గుణాత్మకమైన మార్పులు తెచ్చిన మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

కఠినమైనప్పటికీ వాస్తవాన్నే చెబుదామని, మంత్రి ఇచ్చిన ధైర్యంతోనే ఇప్పటివరకు ముందుకు సాగామని పేర్కొన్నారు. కొంతవరకు సఫలీకృతమయ్యామని, ఇప్పుడు మనం సంస్కరణల దశ నుంచి కన్సాలిడేషన్ వైపు వెళుతున్నామని తెలిపారు. ఈ స్థితిలో ఎదుగుతున్న మొక్కను మనం సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునే వరకు నిర్విరామంగా కృషిచేయాలని అన్నారు. లక్ష్యాలపై క్లియర్ డెడ్ లైన్ పెట్టుకొని జవాబుదారీతనంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి తమీమ్ అన్సారియా, ఇతర రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ మహానాడులో ఏపీ, తెలంగాణతో పాటు.. అండమాన్ కు సంబంధించిన తీర్మానం: సోమిరెడ్డి

**మొదటిపేజీ తరువాయి -** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత నిర్వహిస్తున్న తొలి మహానాడు కావడంతో... ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ క్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే ఈ వార్షిక పండుగలో మొత్తం 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని కమిటీ నిర్ణయించినట్లు కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలతో పాటు తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు, అలాగే మహానాడు చరిత్రలోనే తొలిసారిగా అండమాన్ తెలుగు ప్రజల సమస్యలపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతుండటం విశేషం. ఈ సందర్భంగా వైసీపీ పాలనపై సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విధ్వంసానికి మారుపేరుగా మారిందని, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో పౌరులందరూ పూర్తి స్వేచ్ఛతో జీవిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి లోకేశ్ కృషి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోడ్పాటు, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీకి భారీగా పెట్టుబడులు సాధించామని కొనియాడారు. వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో ఘనంగా నిర్వహించాలనుకున్నప్పటికీ, ప్రభుత్వం అనుసరిస్తున్న పొదుపు చర్యల్లో భాగంగానే ఎన్టీఆర్ భవన్ వేదికగా హైబ్రిడ్ (ఆన్‌లైన్ - ఆఫ్‌లైన్) విధానంలో నిర్వహించనున్నామని సోమిరెడ్డి వివరించారు.

# 'మ్యాజిక్ డ్రెయిన్స్ 'ని మరిన్ని గ్రామాల్లో నిర్మించాలి




**మొదటిపేజీ తరువాయి -** గ్రామాల్లోని పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, శ్మశాన వాటికలను ప్రత్యేకంగా సర్వే చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తద్వారా పంచాయతీ భూములకు రక్షణ కల్పించడం సహా ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా కొత్త ఆదాయ వనరులు సృష్టించవచ్చని చెప్పారు. రెండో దశలో 3,580 కిలోమీటర్ల రహదారులు నిర్మాణం : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన సీనియర్ అధికారులతో పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సాధిస్తున్న పురోగతిపై వారు చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, 'పల్లె పండుగ' మొదటి దశలో 4,000 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం పూర్తయిందని, రెండో దశలో 3,580 కిలోమీటర్ల రహదారులు నిర్మించారని తెలిపారు.

### 'పల్లె పండుగ 2.0'లో పూర్తైన పనులు :

సుమారు 37,800 'గోకులాలు' (పశువుల షెడ్లు) నిర్మించారని, పశువుల తాగునీటి అవసరాలను తీర్చడానికి 15,188 నీటి తొట్టెలు కట్టారని, అలాగే లక్షకు పైగా వ్యవసాయ చెరువుల నిర్మాణం పూర్తయిందని ఆయన వివరించారు. మురుగునీటి సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో 59 కిలోమీటర్ల మేర వినూత్నమైన 'మ్యాజిక్ డ్రైన్‌ల'ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో భాగంగా, ఇప్పటికే క్షేత్రస్థాయిలో 32.30 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని అధికారులు పవన్‌కు తెలియజేశారు.

### వినూత్న మురుగునీటి వ్యవస్థ అమలుకు ఆదేశాలు :

ఈ 'మ్యాజిక్ డ్రైన్‌ల' విధానాన్ని మరిన్ని గ్రామాల్లో ప్రవేశపెట్టాలని పవన్ సూచించారు. ముఖ్యంగా నల్లరేగడి నేలలు నీటి నిల్వ ఎక్కువగా ఉండే డెల్టా ప్రాంతాల్లో, అక్కడి స్థానిక నేల పరిస్థితులకు అనుగుణంగా ఈ మ్యాజిక్ డ్రైన్‌లను నిర్మించాలని ఆయన సలహా ఇచ్చారు. పారిశుధ్య స్థాయిలను మెరుగుపరచడానికి, కొండలు, గుట్టల మధ్య ఉన్న మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా ఈ వినూత్న మురుగునీటి వ్యవస్థను అమలు చేయాలని ఆయన నొక్కి చెప్పారు.

### 'జియో-మానిటరింగ్' వ్యవస్థను ప్రవేశపెట్టిన పవన్ :

ఈ పనులు దీర్ఘకాలం పాటు మన్నికగా ఉండేలా చూసుకుంటూనే చేపట్టాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. గ్రామీణ ప్రజలకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన, దీర్ఘకాలం మన్నిక వచ్చే రహదారులను అందించాలనే నిర్దిష్ట లక్ష్యంతో రహదారి నిర్మాణ ప్రాజెక్టుల కోసం ఒక 'జియో-మానిటరింగ్' వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు పవన్ తెలిపారు. ఈ డిజిటల్ విధానం రహదారి పనులను పర్యవేక్షించడంలోనూ, పనుల పునరావృతం కాకుండా నివారించడంలోనూ సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

### బడ్జెట్ పరిమితులకు లోబడి మాత్రమే మంజూరు చేయాలి :

ఉపగ్రహ చిత్రాలు జియో-ట్యాగింగ్ ద్వారా, ఏదైనా నిర్దిష్ట గ్రామం లేదా ప్రాంతంలో క్షేత్రస్థాయిలో రహదారి పనులు ఎంతమేర పూర్తయ్యాయో కచ్చితంగా నిర్ధారించుకోవడం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం నిర్దేశించిన బడ్జెట్ పరిమితులకు లోబడి మాత్రమే మంజూరు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ పరిమితులకు మించి నిధులు మంజూరు చేస్తే, ప్రభుత్వ రికార్డులకు క్షేత్రస్థాయిలో జరిగిన వాస్తవ ఖర్చులకు మధ్య వ్యత్యాసం ఏర్పడుతుందని, తద్వారా నిధుల దుర్వినియోగం జరిగి, ఆడిట్ పరమైన సమస్యలు తలెత్తుతాయని ఆయన హెచ్చరించారు. గ్రామీణాభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యచరణ : ఉపాధి హామీ మార్గదర్శకాల కింద స్పష్టంగా అనుమతించిన పనులను మాత్రమే గ్రామాల్లో చేపట్టాలని ఆయన మరింత స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర' కార్యక్రమ లక్ష్యాలకు అనుగుణంగా, ఎదీ-+=బావీ చట్టంలోని నిబంధనలను వినియోగించుకుంటూ గ్రామీణాభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయడానికి తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ పాల్గొన్నారు.

# తమిళ రాజకీయాల్లో కీలక పరిణామాలు.. విజయ్ కేబినెట్‌లో చేరనున్న వీసీకే?

**మొదటిపేజీ తరువాయి -** దక్కవచ్చనే ఊహాగానాలు బలపడ్డాయి. ప్రభుత్వ ఏర్పాటు సమయంలో రాజకీయ స్థిరత్వం కోసం కేంద్రంలోని బీజేపీ జోక్యాన్ని నివారించేందుకే టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్నామని వీసీకే గతంలో ప్రకటించింది. అయితే, తాజాగా ఏఐఏడీఎంకే రెబల్ శాసనసభ్యులను మంత్రివర్గంలోకి తీసుకోబోమని టీవీకే నాయకత్వం తనకు స్పష్టమైన హామీ ఇచ్చిందని తిరుమావళవన్ మీడియాకు తెలిపారు. ఒకవేళ ఏఐఏడీఎంకే అసమ్మతి నేతలను ప్రభుత్వంలోకి తీసుకుంటే, తమ మద్దతుపై పునరాలోచించాల్సి వస్తుందని గతంలో ఆయన హెచ్చరించిన నేపథ్యంలో టీవీకే ఇచ్చిన ఈ హామీకి ప్రాధాన్యత ఏర్పడింది. వీసీకేను ప్రభుత్వంలో భాగస్వామిని చేయాలన్న టీవీకే ఆకాంక్షను బహిరంగంగా తెలియజేసిన మంత్రి ఆధవ్ అర్జునకు తిరుమావళవన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో 'ఎల్లోరుక్కుమాన తలైవర్ అంబేద్కర్ ' పుస్తకావిష్కరణ సభలో రాజకీయంగా కలిసి పనిచేయాలని విజయ్ తమ పార్టీని బహిరంగంగా ఆహ్వానించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అప్పటి ఎన్నికల పరిస్థితుల కారణంగా టీవీకే కూటమిలో చేరలేకపోయినా, విజయ్ ప్రకటనను ఒక ముఖ్యమైన రాజకీయ సంకేతంగా భావించామని అన్నారు. అధికారంలో భాగస్వామ్యం పొందడం తమ పార్టీ చిరకాల రాజకీయ ఆకాంక్ష అని తిరుమావళవన్ పేర్కొన్నారు. గతంలో డీఎంకే కూటమిలో ఉన్నప్పుడు, ఆ పార్టీకి పూర్తి మెజారిటీ ఉండటంతో అధికారంలో వాటా అడిగే అవకాశం పరిమితంగా ఉండేదని గుర్తుచేశారు. "మేము కేవలం రెండు సీట్లు గెలిచినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇచ్చాం. మంత్రి పదవులు డిమాండ్ చేయలేదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంలో చేరడం కూడా తమ రాజకీయ దార్శనికతలో భాగమేనని, దీనిపై పార్టీ జనరల్ సెక్రటరీలు, కోశాధికారి, ఇతర సీనియర్ నేతలతో విస్తృతంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. కాగా, ఈ నెల 8న జరిగిన పార్టీ ఉన్నతస్థాయి వర్చువల్ సమావేశంలో కూడా మెజారిటీ సభ్యులు ప్రభుత్వంలో చేరేందుకే మొగ్గు చూపినట్లు సమాచారం.

# విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ ఆర్ బీఎం మినహాయింపు ఇవ్వండి : నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్

**మొదటిపేజీ తరువాయి -** మరోవైపు రాష్ట్రంలోని విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులను వివరించిన భట్టి విక్రమార్క, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదిత ప్రాజెక్టులకు ఎఫ్ ఆర్ బీఎం పరిమితి మినహాయింపు కోరారు.

కేంద్రానికి కృతజ్ఞతలు :

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన డిప్యూటీ సీఎం, తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్ఏఎస్‌సీఐ కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం, విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ ఆర్ బీఎం మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. సాస్కీ కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు :

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయినప్పటికీ 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్‌పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు : అయినా విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని ప్రస్తావించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు నిర్మలా సీతారామన్ కి తెలిపారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని కేంద్రమంత్రికి వివరించారు. విద్యారంగ రూపాంతరానికి రూ.30,000 కోట్లు : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ రూపాంతరానికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని ప్రస్తావించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

# మధ్యాహ్నం వేళ ప్రయాణాలు మానుకోండి

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎండల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను భారీగా అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. వడదెబ్బకు గురైన బాధితులకు ఆసుపత్రుల్లో తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశిస్తూనే, పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



## ఆన్‌లైన్ ఫార్మసీల దందాపై మెడికల్ షాపుల ఆగ్రహం

**మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెల్లో షాపులు బంద్**

**"చిన్న వ్యాపారులను కాపాడాలి" అంటూ ర్యాలీతో నిరసన**

**ఆల్ ఇండియా మెడికల్ షాప్ అసోసియేషన్ పిలుపుతో మూతపడ్డ దుకాణాలు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య):** ఆల్ ఇండియా మెడికల్ షాప్ అసోసియేషన్ పిలుపు మేరకు మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లో బుధవారం మెడికల్ షాపులు బంద్ నిర్వహించారు. ఆన్‌లైన్ మెడిసిన్స్ విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మెడికల్ షాపుల నిర్వాహకులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఆన్‌లైన్ ఫార్మసీల కారణంగా చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, నిబంధనలు పాటించకుండా మందుల విక్రయాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆన్‌లైన్ మందుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌కు మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని మెడికల్ షాపుల నిర్వాహకులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపారు.

## లోతువాగులో ఘోర అగ్ని ప్రమాదం

**రూ.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం**

**బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలి**

**సర్పంచ్ ఈసం కళ్యాణ్ డిమాండ్**






**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య) :** లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోని మాదిగప్రోలు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. స్థానిక రైతు తన పొలంలో చెత్తకు నిప్పు పెట్టగా, మంటల రవ్వలు ఎగిరివచ్చి అశోక్‌నగర్ కు చెందిన గ్రామపంచాయతీ వర్కర్ పాయం సతీష్ ఇంటిపై పడటంతో ఇల్లు మొత్తం మంటల్లో కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఇంట్లో నిల్వ ఉంచిన 100 బస్తాల ధాన్యం, మూడు వ్యవసాయ మోటర్లు, ఒక గ్లామర్ బైక్‌తో పాటు ఇంటి సామగ్రి, వస్త్రాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న లోతువాగు సర్పంచ్ ఈసం కళ్యాణ్, ఉపసర్పంచ్ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పంచాయతీ ట్యాంకర్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై లక్ష్మీదేవిపల్లి ఎమ్మార్వో, ఎస్ఐలకు సమాచారం అందించిన సర్పంచ్ ఈసం కళ్యాణ్, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట డివిజన్ పరిధిలో పద్మా నగర్ కాలనీలో పర్యటించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 20 (వార్త సంధ్య):** చంపాపేట్ డివిజన్ పరిధిలోని పద్మా నగర్ కాలనీ వద్ద గతంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నిధులతో మంజూరైన బాక్స్ డ్రైన్స్ పనులు వివిధ కారణాల వల్ల ఆలస్యమయ్యాయి. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల కాలనీవాసులు కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని కలిసి, మిగిలిపోయిన బాక్స్ డ్రైన్స్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. దానిలో భాగంగా ఈరోజు పద్మా నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి రాబోయే వర్షాకాలానికి ముందుగానే బాక్స్ డ్రైన్స్ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే పలుచోట్ల మ్యాన్ హోల్స్ ధ్వంసమైన నేపథ్యంలో కొత్త మ్యాన్ హోల్స్ నిర్మాణ పనులను కూడా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, నిర్మాణంలో ఉన్న ట్రంక్ లైన్ పద్మా నగర్ కాలనీ, పద్మా ఎంక్లేవ్, ఉదయ నగర్ కాలనీతో పాటు గూండా ఎం.ఆర్.ఆర్. కాలనీ ప్రాంతాల ట్రంక్ లైన్‌కు అనుసంధానమవుతుందని తెలిపారు. ఈ ట్రంక్ లైన్ నిర్మాణం సకాలంలో పూర్తైతే స్థానిక ప్రజలకు వర్షపు నీరు, మురుగునీటి సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమంలో భారస యువ నాయకులు గండికోట శ్రీనాథ్,కృష్ణమాచారి,చీర శ్రీనివాస్ మరియు చుట్టుపక్కల కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు జయవర్ధన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,బద్రీనాథ్,శ్రవణ్ కుమార్ రెడ్డి,నాగేష్,అమరేందర్ సాగర్,నర్సింహా, విజయ్ ,దాసు, ఆనంద్,సత్యనారాయణ,జనార్దన్ తదితరులు పాల్గొన్నారు

## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 20 :** తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎంసీఆర్ హెచ్ ఆర్ డి భోది పెవిలియన్ లో మర్యాదపూర్వకం గా కలిసిన 2025 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అధికారులు.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 20. :** సమావేశంలో పాల్గొన్న వైస్ చైర్మన్ శాంతి కుమారి,కోర్స్ డైరెక్టర్ కందుకూరి ఉషా రాణి .

సీఎం ని కలిసిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

1.ఎట్టబోయిన సాయి శివాని, ఐఏఎస్,, 2.సచిన్ బసవరాజ్ గుత్తూర్, ఐఏఎస్, 3.పోతరాజు హరి ప్రసాద్, ఐఏఎస్, 4.పారస్ కుమార్, ఐఏఎస్

, 5.పి. సురేష్, ఐఏఎస్, 6.నెలటూరు శ్రీకాంత్ రెడ్డి

# ఈఎంఐలు కట్టినా బండ్లు సీజ్..!

**బజాజ్ బిఏసిఎల్ ఫైనాన్స్‌పై కొత్తగూడెంలో బాధితుల ఆగ్రహం**

**భాగ్యనగర్‌లో ఫైనాన్స్ ఏజెంట్ల దందా బట్టబయలు**

**బకాయిల పేరుతో బెదిరింపులు..**

**ఫోన్ కాల్స్‌తో మానసిక వేధింపులు**

**"అడిగితే మాకు సంబంధం లేదు" అంటున్న ఏజెంట్లు**

**"నువ్వు విలేకరి అయితే నాకేంటి" అన్న ఆర్వో ప్రమోద్ పై ఆరోపణలు**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బజాజ్ బిఏసిఎల్ ఫైనాన్స్ పేరుతో జరుగుతున్న వాహన రుణాల వ్యవహారాలు వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొత్తగూడెం భాగ్యనగర్ ప్రాంతంలో ఈఎంఐలు క్రమం తప్పకుండా చెల్లించినప్పటికీ వాహనాలను సీజ్ చేస్తున్నారనే ఆరోపణలు బాధితుల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాహనం కొనుగోలు సమయంలో "సులభ ఈఎంఐలుడ ఎలాంటి ఇబ్బందులు ఉండవు" అంటూ ఆశ చూపిన ఫైనాన్స్ ఏజెంట్లు, సమస్యలు తలెత్తిన తర్వాత మాత్రం చేతులు దులుపుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. "మాకు సంబంధం లేదుడ మీ ఇష్టం ఉంటే కంప్లైంట్ పెట్టుకోండి" అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వినియోగదారులు ఒక ఈఎంఐ ఆలస్యమైనా రికవరీ సిబ్బంది తీవ్రంగా వేధిస్తున్నారని చెబుతున్నారు.

ఫోన్ కాల్స్, బెదిరింపులు, ఇంటి వద్దకు వెళ్లి అవమానించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు ఈఎంఐలు చెల్లించిన వాహనాలకే సీజ్ నోటీసులు ఇవ్వడం బాధితులను మరింత భయాందోళనలకు గురిచేస్తోంది. బాధితులు బజాజ్ కార్యాలయాలను సంప్రదిస్తే "కలెక్షన్ టీమ్ చూసుకుంటుంది" అంటూ అధికారులు తప్పించుకుంటున్నారని సమాచారం. కలెక్షన్ సిబ్బంది మాత్రం "ఫోన్ ఎత్తాలిడ లేకపోతే చర్యలు తప్పవు" అంటూ ఒత్తిడి తెస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తిరిగి ఫోన్ చేసినా ఏజెంట్లు స్పందించడం లేదని చెబుతున్నారు. ఇక వాహనాలను విక్రయించిన షోరూమ్ నిర్వాహకులను సంప్రదిస్తే "ఫైనాన్స్ వ్యవహారాలతో మాకు సంబంధం లేదు" అంటూ చేతులెత్తేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. దీంతో సమస్య పరిష్కారం కోసం ఎవరిని ఆశ్రయించాలో తెలియక అయోమయంలో పడుతున్నామని చెబుతున్నారు.

**బాధితుడి ఆవేదన :**

రిపోర్టర్ : బజాజ్ షోరూమ్ దగ్గర గొడవకు గల కారణం ఏమిటి...?

బాధితుడు : "నేను మూడు నెలలు ఈఎంఐ కట్టలేదు. నా బండి ఏప్రిల్ 19న హైదరాబాద్‌లో సీజ్ చేశారు. ఈ నెల మే 19న డబ్బులు కట్టి నా బండి తీసుకెళ్లాలని షోరూమ్‌కి వచ్చాను. అక్కడ ఉన్నవారు ఏజెంట్ లేడని చెప్పారు. నేను అతనికి కాల్ చేస్తే '10 నిమిషాల్లో తిరిగి కాల్ చేస్తా' అన్నాడు. కానీ తర్వాత నాలుగు గంటల పాటు నా ఫోన్ ఎత్తలేదు."

రిపోర్టర్ : షోరూమ్ అధికారులకు ఫిర్యాదు చేశారా...?

బాధితుడు : "లోపలికి వెళ్లి అడిగితే 'బజాజ్ ఫైనాన్స్ వ్యక్తి బయట కలెక్షన్‌లో ఉన్నాడు' అని సమాధానం ఇచ్చారు."

రిపోర్టర్ : తర్వాత ఏం చేశారు...?

బాధితుడు : "మరో అధికారిని అడిగితే 'మీటింగ్‌లో ఉన్నాడుడ తర్వాత మాట్లాడతాడు' అన్నారు. కానీ ఎలాంటి స్పందన రాలేదు."

రిపోర్టర్ : తర్వాత మీకు కాల్ చేశారా...?

బాధితుడు : "లేదు. సాయంత్రం 8 గంటల సమయంలో మాకు తెలిసిన వ్యక్తితో ఫోన్ చేయించాను."

రిపోర్టర్ : అప్పుడు ఏమన్నారు...?

బాధితుడు : "బండి ఇప్పటికే వేలంలో అమ్మేశామని, ఆర్వోకు మెయిల్ వేసి కన్ఫర్మ్ చేస్తామని చెప్పి ఫోన్ పెట్టేశారు."

రిపోర్టర్ : బండి తిరిగి వచ్చిందా...?

బాధితుడు : "లేదు. అప్పటి నుంచి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. నా ఫోన్‌కూ స్పందించడం లేదు."

రిపోర్టర్ : తదుపరి చర్యలు ఏం తీసుకోబోతున్నారు...?

బాధితుడు : "ఇలాంటి ఇబ్బందులు మరెంతమంది ఎదుర్కొని ఉంటారు. మీడియా సహకారంతో బాధితుల వివరాలు సేకరించి కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించి ఏజెంట్లకు, కంపెనీకి తగిన బుద్ధి చెప్పాలని అనుకుంటున్నాను."

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమావేశం

**బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగుకు**

**కేంద్ర సహకారం కోరిన డిప్యూటీ సీఎం**

**కోల్ ఇండియా తరహాలో గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై**

**పనిచేసేందుకు సింగరేణి ఆసక్తి**

**కొయ్యగూడెం బ్లాక్ III కేటాయింపు, తాడిచెర్ల కోల్**

**బ్లాక్ II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చ**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 20 : న్యూఢిల్లీ, మే 20:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు . ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కోరారు. సింగరేణి దక్షిణ భారతదేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్ III తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్ వేలంలో కేటాయించబడినప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్ III ను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ II అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీ-మైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ II అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్ II కు ఎం ఎం డి ఆర్ చట్టం, 1957లోని సెక్షన్5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్ III కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ II మైనింగ్ లీజ్ అంశాలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ డా. జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ శ్రీ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) శ్రీ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడే (21 తేదీన ) సరస్వతీ అంత్య పుష్కరాల ప్రారంభం

**కంచి స్వామీ శ్రీ విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్**

**శివ ప్రతాప్ శుక్లా లచే తొలి పుష్కర స్నానం**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే20 :** కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేసింది. పుష్కర స్నానాలు మే 21 వ తేదీ నుండి 12 రోజుల పాటు (జూన్ 1 వరకు) జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద కాయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించింది.



కంచి స్వామి విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లచే తొలి పుష్కర స్నానం పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 21 వ తేదీ నుండి జూన్ 1 వతేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు. రూ. 1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20కోట్లలతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవం లకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 టాయిలెట్లు ప్రత్యేకగా ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి కోసం రెండు ఓ.హెచ్.ఆర్.సి లను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు.

**అటట మంది వైద్యాధికారులతో మెడికల్ క్యాంపుల ఏర్పాటు**

కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 300 మంది వైద్యాధికారులు, పారా మెడికల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు నియమించారు. మహాదేవ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు.

**245 ఎకరాల్లో 1.70 లక్షల వాహనాల పార్కింగ్ కై ప్రత్యేక ఏర్పాట్లు**

ఈసారి సరస్వతీ అంత్య పుష్కారాలకు లక్షా 70 వేల వాహనాలు వస్తాయని అంచనా వేసి వీటికి గాను 245 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ ఏరియాలతో పాటు ఘాట్స్, టెంపుల్ తదితర ప్రాంతాలలో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డీ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ 12 రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకుగాను 300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. పుష్కార ఘాట్లలో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

**100 మంది గజ ఈతగాళ్ల నియామకం**

పుష్కర స్నానాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సుమారు 100 మంది గజ ఈతగాళ్లను నియమించారు. వీటితోపాటు సెఫ్టీ బోట్స్, లైఫ్ రింగ్స్, ఎస్.డి.ఆర్.ఎఫ్ టీంలను నియమించారు. పుష్కర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు మీడియా సెంటర్ ను కూడా ఏర్పాటు చేశారు.



RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# క్రీడల్లో ప్రతిభ చాటిన పినపాక విద్యార్థిని

**ఎంపిక పరీక్షల్లో సత్తా చాటిన మర్మం వైష్ణవి**

**పినపాక మినీ గురుకులానికి మరో గౌరవం**

**స్పోర్ట్స్ స్కూల్ హన్మకొండకు మినీ గురుకులం విద్యార్థిని ఎంపిక**

**విద్యార్థినిని అభినందించిన ఐటీడీఏ పీవో రాహుల్**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య) :** పినపాక మండలంలోని స్థానిక మినీ గురుకులం బాలికల పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని మర్మం వైష్ణవి తన క్రీడా ప్రతిభతో స్పోర్ట్స్ స్కూల్ హన్మకొండలో ప్రవేశం సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. విద్యార్థిని చిన్న వయస్సులోనే క్రీడలపై ఆసక్తి పెంచుకుని వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఇటీవల నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారులు విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించారు. పాఠశాలలో క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం వల్లే విద్యార్థిని రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ ఖమ్మం శ్రీమతి బి. అరుణకుమారి, గురుకులం సెల్ ఏఓ కే. నరేందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఎం. శకుంతల, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీ మహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కె.పి.హెచ్.బి కాలనీలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు కుమారస్వామి ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి సాధించి, ఆర్థికంగా స్థిరపడటానికి ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "సమర్థ్" పథకం ద్వారా యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు తమ కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలవడమే కాకుండా, ఆత్మవిశ్వాసంతో స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల దుస్తులను ఆయన పరిశీలించి, వారి నైపుణ్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లను అందజేశారు. నిరంతరం సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండే శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ట్రస్ట్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ బీజేపీ నాయకులు రఘురాం, వినోద్ గౌడ్, సూరిబాబు, ప్రేమ్, స్థానిక నేతలు, ట్రస్ట్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పాల్వంచ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలి**

**అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి**

**బాధితులకు న్యాయం జరిగేలా పోలీసుల పనితీరు ఉండాలి**

**పోలీస్ స్టేషన్‌లలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి**

**ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేయాలి**

**పాల్వంచ పీఎస్‌లో కేసులపై సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ**






**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ నేడు పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అక్కడి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్ కుమార్, ఎస్సైలు టి. నాగరాజు, జీ. విజయ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీ కాలనీలో వివాహిత అదృశ్యం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లో నివాసముండే సిందం విజయ్ కుమార్ (45) వృత్తిరీత్యా డ్రైవర్. అతనికి 2007లో శ్రీకాకుళానికి చెందిన రేవతి (36)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా రేవతి అనారోగ్య సమస్యలతో బాధపడు తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగు తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో రేవతి ఇంట్లో ఉన్న నగదు, బంగారం, మొబైల్ ఫోన్ తీసుకుని ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం 6 గంటలకు విజయ్ కుమార్ ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో విజయ్ కుమార్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు 'మహిళ అదృశ్యం' కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏఎస్ఐ బి. పురుషోత్తం ఈ కేసును విచారిస్తున్నారు.

# ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ బోధి పెవిలియన్ లో పరిశ్రమల శాఖ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష.

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 20 :** హాజరైన పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి , తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక ,పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి,ఇతర ఉన్నతాధికారులు.

**భారత్ ఫ్యూచర్ సిటీ లో ల్యాండ్ అలాట్మెంట్ ,పరిశ్రమల ఏర్పాటుపైన సీఎం రేవంత్ రెడ్డి ..**







నెట్ జీరో సిటీ తరహా లోనే డిజైన్స్ ఉండాలి మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి ..ఇందులో రాజీ పడొద్దు అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలి.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలి.. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీ కి తీసుకురావాలి.. ఫ్యూచర్ సిటీ లో ప్రజా ప్రతినిధులు,సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్ లకు 500 ఎకరాలు.. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్య లు తీసుకోవాలి.. అవసరం అయితే ప్రధాని మోదీ ని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దాం.. జూన్ లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్ లో పరిశ్రమల ఏర్పాటు కు శంకుస్థాపన జరిగేలా చూడాలి.. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలి .. ఇన్వెస్ట్ తెలంగాణ పేరు లో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి.. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో,వెబ్ సైట్ రూపొందించాలి .. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలి రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థ ని రూపొందించాలి.. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్ గా నియమించే అంశాన్ని పరిశీలించాలి.. తమిళనాడు,గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలి.. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలి.. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలి.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్ టీ పీ లను వినియోగించాలి.. జీసీసీ లు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్,వరంగల్,విజయవాడ రోడ్ల సమీపం లో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలి.. ద్వితీయ శ్రేణి నగరాల్లో జీసీసీ ఏర్పాటు పైన దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలి.. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు టీ ఫైబర్ కు కనెక్ట్ కావాల్సిందే

# ప్రజాప్రభుత్వంలోనే పేదలకు నిజమైన లబ్ధి

**అర్హులైన ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇల్లు**

**పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**రూ.5 లక్షల సాయంతో నిరుపేదలకు పక్కా ఇళ్లు**

**అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**

**బీఆర్ఎస్ హయాంలో పేదలకు తీవ్ర అన్యాయం**

**టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య):** అర్హులైన ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం ఇళ్లు అందిస్తోందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు తెలిపారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని హమాలీ కాలనీలో దేవిగబ్బర్ సింగ్ దంపతులు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటన్నారు. ఇంటి స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లు లేని పేదలు, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని, అయితే గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మరింత మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ పట్టణ అధ్యక్షులు జయప్రకాష్, ఓబీసీ జిల్లా కార్యదర్శి బొబ్బాల వెంకట్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు దయ్యాల సమ్మయ్య, కోంపెల్లి వీరయ్య, రావు కిరణ్, బోడా రమేష్ నాయక్, అక్బర్, యువజన కాంగ్రెస్ నాయకులు సాయిచంద్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బతికున్నప్పుడు కనిపించని మానవత్వం..

**మరణానంతరం పరామర్శల పబ్లిసిటీ పై ఆవేదన**

**కార్యకర్తల కష్టకాలంలో తోడు నిలవని రాజకీయ నాయకత్వం**

**ఆస్పత్రిలో ఉన్నప్పుడు కనిపించని మానవత్వం**

**మరణానంతరం బియ్యం సంచులతో ఫోటో సెషన్లు**

**కార్యకర్తల ప్రాణాల కంటే ప్రచారానికే ప్రాధాన్యం?**

**కుటుంబాన్ని కాపాడుకోవాలని సామాన్యులకు పిలుపు**

**కష్టకాలంలో నిలిచేది కుటుంబమే.. రాజకీయాలు కాదు**

**జెండాలు మోసే కార్యకర్తల బాధలపై ఆవేదన**

**బతికున్నప్పుడు ఆదుకోని నేతలు..**

**తర్వాత భరోసా మాటలు రాజకీయ ప్రచారాలు**

**సోషల్ మీడియాలో తీవ్ర చర్చ**

**నేటి వార్త సంధ్య లో ప్రత్యేయక కథనం**






**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య):** నేటి రాజకీయాల్లో మానవత్వం కంటే ప్రచార ఆర్భాటాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ భావోద్వేగ పోస్టు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాజకీయ పార్టీల కోసం సంవత్సరాల తరబడి జెండాలు మోసే సామాన్య కార్యకర్తలు, ప్రజలు ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న సమయంలో సహాయం చేయడానికి ముందుకు రాని నాయకులు, మరణానంతరం మాత్రం పరామర్శల పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని పోస్టులో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "ఆస్పత్రిలో ఉన్నప్పుడు మానవత్వంతో స్పందించి కొద్దిపాటి ఆర్థిక సహాయం చేయండి అంటే ఎవరూ ముందుకు రారు. కానీ మరణించిన తర్వాత మాత్రం పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా మాటలు చెబుతూ, 25 కేజీల బియ్యం, 50 కేజీల బియ్యం, చేతిలో వెయ్యి లేదా రెండు వేల రూపాయలు పెట్టి ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారు" అంటూ పోస్టులో పేర్కొన్నారు. అనంతరం ఆ ఫోటోలను సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేసుకోవడం నేటి రాజకీయాల్లో సాధారణమైందని విమర్శించారు. ప్రస్తుతం చాలా మంది కార్యకర్తలు తమ కుటుంబ అవసరాలను, ఆరోగ్య పరిస్థితులను పక్కనపెట్టి రాజకీయ పార్టీల కోసం అహర్నిశలు పనిచేస్తున్నారని, కానీ కష్టకాలంలో వారిని ఆదుకునే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన కార్యకర్తలు అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నప్పుడు నాయకులు స్పందించక పోవడం బాధాకరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. "బతికున్నప్పుడు కనిపించని మనసు.. చనిపోయిన తర్వాత మాత్రం పబ్లిసిటీ కోసం పరామర్శలు" అనే వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కష్టాల్లో ఉన్నప్పుడు రాజకీయ నాయకుల కంటే కుటుంబ సభ్యులే నిజమైన అండగా నిలుస్తారని, సామాన్య కార్యకర్తలు ముందుగా తమ ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును ఆలోచించుకోవాలని పోస్టులో సూచించారు. ఈ పోస్టుపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. రాజకీయాల్లో మానవత్వం తగ్గిపోతోందని కొందరు వ్యాఖ్యానిస్తుండగా, నిజంగా కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకునే వ్యవస్థ రాజకీయ పార్టీల్లో ఉండాలని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ పోస్టు జిల్లాలోని రాజకీయ, సామాజిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది.

# ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు పార్టీ శ్రేణులు సహకరించాలి

**ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**

**రెవెన్యూ అధికారులకు తక్షణమే బీఎల్‌ఏల వివరాలను అందించాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య) :** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సిపిఐ మండల, పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికార అధికారులకు సహకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సూచించారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్' నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... నిస్పక్షపాతంగా ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు సహకరిం చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంద న్నారు. జూన్ 25 నుండి జూలై 24, 2026 వరకు ఇంటింటి సర్వే జరుగు తుందని, అనంతరం జూలై 31న సేకరి ంచిన వివరాల ఆధారంగా ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు ప్రచురి స్తారని తెలిపారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాపై జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి, నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాత అక్టోబర్ 1న అధికారులు తుది జాబితాను విడుదల చేస్తారని వివరించారు. పార్టీ నాయకులు తక్షణమే రెవెన్యూ అధికారులకు పార్టీ నుంచి బాధ్యత వహించే బిఎల్‌ఏల వివరాలు అందించాలని కోరారు.

# ప్రజా ఆరోగ్యం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

**ఔషధ రంగంపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యాన్ని అడ్డుకుందాం**

**మందుల షాపుల యజమానుల న్యాయమైన పోరాటానికి పూర్తి మద్దతు**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 20 (వార్త సంధ్య) :** ఫార్మసీ రక్షణ కోసం, ప్రజా ఆరోగ్యం పరిరక్షణ కోసం దేశవ్యాపితంగా చేపట్టిన మెడికల్ షాపుల బందులో భాగంగా కొత్తగూడెం కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గణేష్ టెంపుల్ ఏరియాలో నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ నిరసన శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సందర్శించి, బంద్‌కు తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్లే నేడు మెడికల్ షాపుల యజమానులు రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల స్థానిక వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, నకిలీ మందుల సరఫరా పెరిగి ప్రజారోగ్యం తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా ఉన్న చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఫార్మసీ రంగాన్ని, చిన్న వ్యాపారులను కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా సాగుతున్న ఈ పోరాటం ఎంతో న్యాయమైనదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మెడికల్ అసోసియేషన్ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో భగభగ, 47 డిగ్రీలకు చేరనున్న ఎండలు, పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

**గురువారం నుంచి మరింత పెరగనున్న ఎండల తీవ్రత**

**పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ**

**రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరే అవకాశం**

**మంగళవారం వడదెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా నలుగురి మృతి**

**19 జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**



తెలంగాణ అగ్నిగుండంలా మారుతోంది. రాష్ట్రంలో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరింది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి 47 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో నలుగురు మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. **రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు** మంగళవారం రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 19 జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఎండ తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌లో అత్యధికంగా 45.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నల్గొండ, నిర్మల్, సిద్దిపేట, మంచిర్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లో అనేకచోట్ల 45 డిగ్రీల మార్కును దాటింది. హన్మకొండ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల్లో 44-45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్ నగరంలోనూ ఎండ తీవ్రత 43 డిగ్రీలకు చేరింది. **రెడ్ అలర్ట్, వడగాల్పుల హెచ్చరిక** రానున్న రెండు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్, జనగామ, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45-47 డిగ్రీల మధ్య నమోదవుతాయని, ప్రజలు మధ్యాహ్నం వేళ ఇళ్లకే పరిమితం కావాలని సూచించింది. మరోవైపు నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో అక్కడ కూడా రెడ్ అలర్ట్ జారీ చేశారు. **ఎండవేడికి ప్రమాదాలు.. అకాల వర్షాలు** ఎండల తీవ్రతకు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు, గాలివాన బీభత్సం సృష్టించాయి. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో గాలివానకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో గాలి దుమారానికి ఇళ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ అకాల వర్షం కురిసింది. **వడదెబ్బతో నలుగురి మృతి** రాష్ట్రంలో మంగళవారం వడదెబ్బకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రైతు రాచర్ల రాజు (50), వికారాబాద్ జిల్లాకు చెందిన కార్మికుడు సామెల్ (35), ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కనక లచ్చు (52), శాంతినగర్‌కు చెందిన బిరుదుల కిరణ్‌కుమార్ (45) వడదెబ్బ తగిలి మృతి చెందారు.

# గుంటూరు జిల్లాలో యువకుడి దారుణ హత్య



తెనాలి సమీపంలోని కంచర్లపాలెంలో ఘటనవాలీబాల్ నెట్ వైరుతో గొంతు బిగించి చంపినట్లు పోలీసుల అనుమానంపాత కక్షల కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులుమృతుడు కోపల్లె కార్తీక్‌గా గుర్తింపుగుంటూరు జిల్లా తెనాలిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తెనాలి రూరల్ మండలం కంచర్లపాలెం గ్రామ శివారులోని వాలీబాల్ కోర్టు వద్ద ఈ ఘోరం వెలుగుచూసింది. మృతుడిని కోపల్లె కార్తీక్ (18)గా పోలీసులు గుర్తించారు. వాలీబాల్ కోర్టు వద్ద కార్తీక్ నిర్జీవంగా పడి ఉండటాన్ని కొందరు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న తెనాలి రూరల్ పోలీసులు, క్లూస్ టీమ్ సాయంతో ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలంలో ఉన్న పరిస్థితులను బట్టి, గుర్తుతెలియని దుండగులు వాలీబాల్ నెట్ వైరును కార్తీక్ గొంతుకు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, హత్యకు పాత కక్షలు కారణమా? లేక మరేదైనా వివాదం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# కలిసి తిరిగారు.. ఎక్కడ బెడిసికొట్టిందో

**బండి భగీరథ్ కేసుపై బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

**పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథ్**

**దీనితో బీజేపీకి సంబంధం లేదని రాకేశ్ రెడ్డి స్పష్టీకరణ.**

**రెండు కుటుంబాల మధ్య వ్యవహారమన్న ఎమ్మెల్యే**

**అమ్మాయే స్వయంగా భగీరథ్‌ను కారులో తీసుకెళ్లినట్లు వెల్లడి**

**కలిసి తీర్థయాత్రలకు వెళ్లినట్లు చెప్పిన బీజేపీ నేత**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టు కావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఈ కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదంతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కుటుంబాల మధ్య గొడవఈ కేసు పూర్తిగా రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవ అని ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాకేశ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తమకు వచ్చిన కొన్ని వీడియోల ప్రకారం ఆ రెండు కుటుంబాల మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో అర్థమవుతుందని చెప్పారు. చిన్నప్పటి స్నేహంబాధిత అమ్మాయి తల్లి భగీరథ్‌కు ఎంతో ప్రేమగా గోరు ముద్దలు తినిపించిన దృశ్యాలు ఆ వీడియోల్లో ఉన్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే బాధిత అమ్మాయే స్వయంగా భగీరథ్‌ను కారులో తీసుకెళ్లినట్లు తెలిపారు. వారిద్దరూ చిన్నప్పటి నుంచి బావమరదళ్లలా కలిసి తిరిగారని, కలిసి పెరిగారని పేర్కొన్నారు. తీర్థయాత్రలకు కూడా..ఆ రెండు కుటుంబాలు కలిసి శ్రీశైలం, అరుణాచలం వంటి ప్రముఖ తీర్థయాత్రలకూ వెళ్లారని రాకేశ్ రెడ్డి వివరించారు.



అంత బాగా ఉన్న సంబంధాలు ఎక్కడో తేడా కొట్టాయని, అందుకే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. రాజకీయ నాయకుల కుటుంబాలకు బండి భగీరథ్ అంశం ఒక గుణపాఠం లాంటిదని అభిప్రాయపడ్డారు. పరిష్కారం అవుతుందిచివరకు ఈ కేసును ఆ రెండు కుటుంబాలు కలిసి కూర్చొని పరిష్కరించుకుంటాయని తాను భావిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

# వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థ రెడ్డిపై కేసు నమోదు

**మంత్రి టీజీ భరత్ ఫిర్యాదుతో చర్యలు**

**మే 14న ధర్నాలో చేసిన వ్యాఖ్యలే కారణం**

**పరువుకు భంగం కలిగించారని మంత్రి ఆరోపణ**

**కేసును ధ్రువీకరించిన కర్నూలు పోలీసులు**



వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై కర్నూలులో కేసు నమోదైంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ గుప్తా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు కర్నూలు త్రీ టౌన్ సీఐ శేషయ్య ధృవీకరించారు. వివరాల్లోకి వెళ్తే, మే 14వ తేదీన కర్నూలు కలెక్టరేట్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి టీజీ భరత్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. తన వ్యాఖ్యల ద్వారా తన పేరు, పరువుకు భంగం కలిగించడంతో పాటు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రయత్నించారని మంత్రి భరత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంత్రి నుంచి అందిన ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పేలిన ఏసీ, తప్పిన పెను ప్రమాదం

**వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి గదిలో ఘటన**

**ఎవరికీ గాయాలు కాకపోవడంతో తప్పిన పెను ప్రమాదం**

**పేలుడుకు 15 నిమిషాల ముందే ఏసీని పరిశీలించిన టెక్నీషియన్**

**అధిక వేడి కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా**

పల్నాడు జిల్లా వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. ఆసుపత్రిలోని కొత్త భవనంలో ఉన్న రక్తనిధి గదిలో ఎయిర్ కండిషనర్ (ఏసీ) భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ ఘటనతో రోగులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, ప్రమాదం జరిగినప్పుడు గదిలో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో అధికార యంత్రాంగం, ఆసుపత్రి సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఏసీ పేలడంతో గది మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. భారీ శబ్దం విన్న సిబ్బంది వెంటనే అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ పేలుడులో ఏసీ



పూర్తిగా కాలిపోగా, గదిలోని ఇతర విలువైన పరికరాలు కూడా దెబ్బతిన్నాయి. అయితే, సోమవారం సాయంత్రానికే రక్త నిల్వలు అయిపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. పేలుడుకు కేవలం 15 నిమిషాల ముందే టెక్నీషియన్ ఏసీని పరిశీలించి వెళ్లారని ఆసుపత్రి సూపరింటెండెంట్ దయానిధి వెల్లడించడం గమనార్హం. సమాచారం అందుకున్న జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ ప్రసూన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఏసీ నిరంతరం 24 గంటలు పనిచేయడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆసుపత్రి వైరింగ్ వ్యవస్థను పూర్తిగా తనిఖీ చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు తర్వాతే అసలు కారణాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

**బాపట్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి, కుటుంబ సభ్యులకు గాయాలు**

**అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాపట్ల యువకుడు మృతి**

**మృతుడి తండ్రికి తీవ్రగాయాలు, తల్లి, సోదరుడికి గాయాలు**

**కుటుంబం ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టిన మరో వాహనం**

**న్యూ మెక్సికోలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఆవుల పూర్ణగోపి**

**ఇటీవలే అమెరికాకు కుమారుడి వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు**



అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ వార్త తెలియడంతో బాపట్లలోని వారి నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే, బాపట్ల కొత్త బస్టాండ్ సమీపంలో నివసించే ఆవుల పూర్ణగోపి (35) అమెరికాలోని న్యూ మెక్సికోలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భారత సైన్యంలో పనిచేసి రిటైరైన ఆయన తండ్రి ఆవుల శ్రీనివాసరావు, తన భార్య, చిన్న కుమారుడితో కలిసి ఇటీవలనే అమెరికా వెళ్లారు. నిన్న పూర్ణగోపి తన కుటుంబంతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా, వారి వాహనాన్ని వెనుక నుంచి మరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పూర్ణగోపి అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన తండ్రి శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పూర్ణగోపి తల్లి, తమ్ముడికి కూడా గాయాలయ్యాయి. ప్రస్తుతం గాయపడిన వారందరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బీసీల ఉపాధికి కొత్త స్కీం,నెలకు రూ.50 వేల వరకు ఆదాయమే లక్ష్యం

**బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించే లక్ష్యంతో**

**ఆదరణ 3.0 పథకమన్న మంత్రి సవిత**

**ఈ పథకం కోసం రూ.1000 కోట్లు**

**కేటాయిస్తున్నామని వెల్లడి**

**కులవృత్తుల వారికి ఆధునిక పనిముట్లు,**

**నైపుణ్య శిక్షణ ఇస్తామన్న మంత్రి**

బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. ఇందుకోసం 'ఆదరణ 3.0' పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఈ పథకం అమలుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఆదరణ 3.0 పథకానికి ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ పథకం ద్వారా కుల వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు అందించి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను విజయవంతంగా అమలు చేశారని, ఇప్పుడు దానికి కొనసాగింపుగా ఆదరణ 3.0కు శ్రీకారం చుట్టినట్లు గుర్తుచేశారు. ఈ పథకంలో లబ్ధిదారులకు వృత్తి నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. వ్యక్తిగతంగా లేదా గ్రూపులుగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ యూనిట్ల ద్వారా లబ్ధిదారులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వచ్చేలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆదరణ ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని ఆమె హామీ



ఇచ్చారు. ఇప్పటికే అన్ని బీసీ కులాల కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లతో ఈ పథకంపై అభిప్రాయాలు సేకరించామని, యూనిట్ల మంజూరులో వారి సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, పలువురు అధికారులు, బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.

# బీరు బాటిల్‌లో కండోమ్ ప్యాకెట్,మందుబాబు షాక్!

**సిద్దిపేట జిల్లాలో సంఘటన**

**కింగ్‌ఫిషర్ బీరు బాటిల్‌లో కనిపించిన కండోమ్ ప్యాకెట్**

**వైన్ షాపు ఎదుట బాధితుడి ఆందోళన.. సిబ్బందితో వాగ్వాదం**

**రంగంలోకి దిగిన ఎక్సైజ్ శాఖ.. దర్యాప్తు ప్రారంభం**



బీర్ బాటిళ్లలో పురుగులు, బల్లులు రావడం గురించి విన్నాం. కానీ, ఏకంగా సీల్ చేసిన బీరు బాటిల్‌లోనే కండోమ్ ప్యాకెట్ రావడం సిద్దిపేట జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో బీరు ప్రియులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లిలోని లక్ష్మీ నరసింహ వైన్ షాపులో ఓ వ్యక్తి కింగ్‌ఫిషర్ లైట్ బీర్లు కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి కొన్ని బీర్లు తాగిన తర్వాత, సీల్ తీయని మరో బాటిల్‌ను చూడగా అందులో కండోమ్ ప్యాకెట్ కనిపించడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఆ బాటిల్‌ను తీసుకుని వైన్ షాపు వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశాడు. అయితే, అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో అతడు మరింత ఆగ్రహానికి లోనయ్యాడు. ఈ వ్యవహారంపై బాధితుడు వెంటనే స్థానిక ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. వైన్ షాపునకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అసలు సీల్డ్ బాటిల్‌లోకి కండోమ్ ప్యాకెట్ ఎలా వచ్చిందని దర్యాప్తు చేస్తున్నారు. ఇది తయారీ సమయంలో జరిగిన లోపమా? లేక ఎవరైనా కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారా? అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మత్స్యకార, అన్నదాతల సంక్షేమమే మాకు అత్యంత ముఖ్యం, పవన్ కల్యాణ్

**మత్స్యకారుల వలసలను**

**నివారిస్తామన్న పవన్ కల్యాణ్**

**స్థానికంగానే మెరుగైన ఉపాధి, ఆర్థిక**

**అవకాశాలను కల్పిస్తామని వెల్లడి**

**ప్రతి మత్స్యకార కుటుంబానికి వారి**

**బ్యాంకు ఖాతాల్లోకి రూ. 20 వేలు**


**జమ చేస్తున్నామన్న డిప్యూటీ సీఎం**

ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీరప్రాంతంలో నివసిస్తున్న మత్స్యకార కుటుంబాల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు



వేస్తోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మత్స్యకారుల వలసలను నివారించడంతో పాటు, వారికి స్థానికంగానే మెరుగైన ఉపాధి, ఆర్థిక అవకాశాలను కల్పించడమే తమ ప్రభుత్వం ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, సంక్షోభాల కంటే కూడా అన్నదాతలు, మత్స్యకారుల సంక్షేమమే తమకు అత్యంత ప్రాధాన్యమని, గతంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని ఈ సందర్భంగా ఆయన మరోసారి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే, మత్స్యకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటుతూ వరుసగా రెండో ఏడాది కూడా 'మత్స్యకార సేవలో' పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విజయవంతంగా విడుదల చేసింది. ఈ పథకం కింద అర్హత సాధించిన ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 20,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అత్యంత పారదర్శకంగా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. తీరప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా భవిష్యత్తులో వలసలను పూర్తిగా అరికట్టేలా మరిన్ని పటిష్ఠమైన చర్యలు తీసుకోబోతున్నట్లు వెల్లడించారు.

# ఒయ్యారి నడకే స్త్రీకి నగ



కవి భర్తృహరి ప్రతి మానవుడికి జీవన గమనంలో ఉపయోగపడే 'నీతి', 'శృంగార', 'వైరాగ్య' శతకాలను రచించాడు. ఈ మూడు శతకాలు అమూల్య రత్నాల వంటి శ్లోకాలతో నాటినుంచి నేటివరకూ లోకాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. భర్తృహరి యోగిగా మారకముందు రచించిన శతకమ్ 'నీతి శతకమ్' కాగా ఆ తదుపరి రచించినది 'శృంగార శతకమ్'. కవి భర్తృహరి తన భార్య పింగళతో సంసార జీవితాన్ని గడిపే కాలంలో, సమాజంలోని శృంగార జీవన విధానాన్ని పరికిస్తూ ఈ 'శృంగార శతకమ్'ను వ్రాసి ఉంటాడని పండితాభిప్రాయం. 'శమ్భు స్వయమ్భు హరయో హరిణే- క్షణానాం/ యేనా క్రియన్త సతతం గృహకుంభదాసాః/ వాచామ గోచర చరిత్ర విచిత్రితాయ/ తస్మై నమో భగవతే మకరధ్వజాయ' -శివ, బ్రహ్మాది విష్ణు దేవుళ్లనూ సైతం వాళ్ల భార్యలకధీనులుగా చేసి ఇండ్లలో ఘటదాసులుగా మార్చి, ఇట్లా మాటలకందని చేతలనెన్నింటినో చేసేవాడైన మన్మథ దేవుడికి నమస్కారం అంటూ నమస్కరిస్తూ భర్తృహరి ఈ శతకాన్ని ప్రారంభించారు. ఇందులో 'స్త్రీ ప్రశంస' మొదలుకొని 'ఋతు వర్ణన పద్ధతి' వరకూ ఏడు శీర్షికలతో నూరు శ్లోకాలున్నాయి. భర్తృహరి మూడు శతకాలలోని శ్లోకభావాలననుసరించి ప్రఖ్యాత సంస్కృత కావ్య వ్యాఖ్యాత రామచంద్ర బుధేంద్రుడు శీర్షికలను నిర్ణయించాడని చెప్తారు.

**మొదటి శీర్షిక:** 'స్త్రీ ప్రశంస'లో 'స్మితేన భావేన చ లజ్జయా' సుందర దరహాసంతో, సిగ్గుతో, బెదురుతో, సొగసుగా ముఖం తిప్పుకునే విధానాలతో, క్రీగంటి చూపులతో స్త్రీలు తమ భర్తలను తమ చెంతనే బంధిస్తారంటూ, కనుబొమ్మల నేర్పుదనాల ముడిపాటులూ, ఓర చూపులూ, ముసిముసి నవ్వులూ, మెత్తని మాటల పలుకరింపులూ, సాగుతూ నిలుస్తూ మళ్లీ సాగే ఒయ్యారాల నడకలు స్త్రీలకు ఆభరణాలూ, ఆయుధాలూ అనీ పందొమ్మిది శ్లోకాల్లో స్త్రీని భర్తృహరి ప్రశంసించాడు. చక్కని కనుబొమ్మలు పద్మ సౌందర్యాన్ని అవహేళన చేయగలిగే ఆ కన్నులూ, మేలిమి పసిడిని ప్రక్కకు పెట్టగలిగే మేనిరంగూ యువతులకు పుట్టుసొమ్ములంటాడు. అందమైన మగువకు మన్మథుడు సేవకుడేనని, ఆమె కనుబొమ్మల కదలికల సూచనలతో మన్మథుడు తన బాణాలను వేసేవాడుగా నడుచుకుంటున్నాడనీ అంటాడు. చీకట్లను పోగొట్టే దీపమూ, జ్వాలాశిఖాగ్నీ, తారలూ, సూర్యచంద్రులూ ఉన్నా%ౌ% కొదమ లేడి కన్నుల వంటి కనులు కలిగిన ప్రియకాంత చెంతలేకుంటే ఈ లోకమే తన కంధకారమయమనీ చెప్తాడు. రెండవ శీర్షిక: 'సంభోగ (సౌఖ్య) వర్ణనము'లో సంభోగ శృంగారాన్నీ, విప్రలంభ శృంగారాన్నీ పదమూడు శ్లోకాల్లో వర్ణించాడు. 'విశ్రమ్య విశ్రమ్య వనే ద్రుమాణాం.. నివారయన్తీ శశినోమయూఖాన్' -కాంతుడి విరహంలో కాగుతున్న కోమలి ఒకామె రాత్రి తోటలో చంద్ర కిరణాల తాపాన్ని తట్టుకోవడానికి తలపై కొంగును కప్పుకొని అక్కడ తచ్చాడుతూ చెట్ల నీడల్లో కూర్చుంటూ సేద దీరిలేస్తూ తిరిగి కూర్చుంటూ మళ్లీ లేచి తిరుగుతూ ప్రియుడి కోసం ఎదురుచూస్తుందని విప్రలంభ శృంగారాన్ని వర్ణించాడు. కుముదాక్షులూ, ఇందీవరాక్షులూ అయిన మాప్రేయసుల యవ్వన రూపాలను ముసలితనం ఆవరించక మునుపే సుఖ భోగాలలో తేలడానికి మాకు ఇళ్ళకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వండి ఓ రాజా! అంటూ రాజును అర్థిస్తాడు. మూడవ శీర్షిక: 'పక్షద్వయనిరూపణం'లో స్త్రీలను ప్రేమతో చూసుకునేవారికి ఇహలోక సౌఖ్యాలూ, స్త్రీలపై విరక్తితో వారిని త్యజించేవారికి పరలోక సౌఖ్యాలు కలుగుతాయనీ అనురక్తి, విరక్తి అనే రెండు పక్షాలుగా ఏడు శ్లోకాల్లో వర్ణించాడు. మానవా- నీవు విరాగివై అడవి జింకలకు పచ్చని దర్భలను ఆహారంగా అందిస్తూ అక్కడే అడవిలో ఉండిపో లేదా అనురాగివై నీ వధూమణికి తాంబూలాన్ని ప్రేమతో అందిస్తూ నీ గృహ స్వర్గంలోనే ఉండిపో! అని చెప్తాడు. ఇక్కడినుంచే భర్తృహరి వైరాగ్యం వైపు మళ్లుతున్నాడని చెప్పవచ్చు. ఓ జనులారా! ఘననితంబినులైన ప్రమదల కన్నా మనోజ్ఞమైన వారెవరూ లోకంలో లేరు, విరహాన్ని రగిలించి ఏడిపించడంలో వీళ్ల కన్నా ఇంకెవరూ లేరని అంటాడు. నాలుగవ శీర్షిక: 'కామినీ గర్హణము'లో 'కాన్తేత్యుత్పలలోచనేతి విపులో శోణీభరే..' అన్ని తెలిసిన విద్వాంసుడూ యవ్వనాదులు అశాశ్వతం అని తెలిసి కూడా అందమైనది మగువ అని మెచ్చుకుంటూ మన్మథకేళుల్లో తేలియాడుతుంటాడు. ఆహా! మోహపు దుశ్చేష్ట ఎంతటి ఆశ్చర్యకరమని అంటాడు. అతివను, తలచుకుంటే ఆమె మన్మథ తాపాన్ని రగిలిస్తుందనీ, చూస్తేనే మదన సంబంధోన్మాదాన్ని పెంచుతుందనీ, తాకితేనే మోహపు తన్మయత్వాన్ని కలిగిస్తుందనీ.. ఇట్లా అస్థిరంగా, బలహీనంగా మార్చే ఆ అతివ ప్రేయసి ఎట్లా అవుతుందని ప్రశ్నిస్తాడు. అనురాగం ఉన్నప్పుడు ఆమె అమృతలత, అనురాగం లేనప్పుడు ఆమెనే విషమంజరి అని ఇట్లా స్త్రీని గర్హిస్తూ ఇరువై శ్లోకాలు రచించాడు భర్తృహరి. ఐదవ శీర్షిక: 'సువిరక్త పద్ధతి'లో స్త్రీల పట్ల విముఖులైన వాళ్లలో సువిరక్తులూ, దుర్విరక్తులూ అని పురుషులలో రెండు రకాలని చెప్తాడు. తెల్లని విశాల నేత్రాలు కలవారైన, పరువాల గరువాల మిడిసిపాటుతో ఎద సంపద గలవారైన అతివల అందమైన రూపాలను చూసి ఏ పురుషుల మనసులు మదన వికారానికి లొంగిపోవో వారే ధన్యులు అంటూ సువిరక్త పద్ధతిని తొమ్మిది శ్లోకాల్లో వరిస్తాడు. ఆరవ శీర్షిక: 'దుర్విరక్త పద్ధతి'లో 'తావదేవ కృతినామపి స్ఫురత్యేష నిర్మల వివేకదీపః' విద్వాంసులనెంతవరకూ ఆడవాళ్ల వయ్యారాల వాలుచూపుల అంచులు తాకవో అంతవరకూ ఆ విద్వాంసుల నిర్మల వివేకదీపం ఉజ్వలంగా ప్రకాశిస్తుందంటూ స్త్రీలపై నిందాపూర్వకంగా పది శ్లోకాలు రాశాడు. ఇక ఏడవ శీర్షిక: 'ఋతు వర్ణన పద్ధతి'లో 'పరిమళభృతో వాతాః శాఖా నవాంకుర కోటయోః' పవనాలు పరిమళభరితాలయ్యాయి, చెట్లకొమ్మలు క్రొత్త చిగురులు వేశాయి, మగ కోకిలల కాకలీ స్వరగీతాలు ఆడ కోకిలలకు పియాన్ని కూరుస్తున్నాయి, వనితల వదనేందు బింబాలు మరుకేళుల వల్ల చెమట చుక్కలతో చెమరుస్తున్నాయి, వసంతం వస్తూండగానే ధరిత్రిపై ప్రతిదీ సుందర మధుర గుణ ప్రవర్ధమానమై ప్రవర్ధిల్లుతుదన్నదని వసంత ఋతువు గురించి ఆరు శ్లోకాల్లో వర్ణించాడు. 'అచ్ఛాచ్ఛచన్దనరసార్ద్రతరా మృగాక్ష్యో' స్వచ్ఛ చందనరసాల మైపూతలతో స్త్రీలూ, జలయంత్ర సదనాలు, పుష్పాలు, పున్నమి వెన్నెలా, విరజాజి వాసనల మందమారుతమూ మున్నగునవి గ్రీష్మ ఋతువులో హర్షా న్నీ, మన్మథుడి గర్వాన్నీ పెంచుతున్నాయని గ్రీష్మఋతువును భర్తృహరి మూడు శ్లోకాల్లో వర్ణించాడు. ఇక వర్షఋతువు గురించి కామాన్ని ఉద్దీప్తం చేసేదని చెప్తూ ఆరు శ్లోకాల్లో వర్ణించాడు. ఇంకా శరదృతువులో పురుషుడు నడిరాత్రి వరకు అటూ ఇటూ పొరలి చిన్న కునుకు తీసి లేచి ప్రియకాంతతో కూడి తర్వాత ఆరని దాహంతో ఉన్నవాడై తన ప్రియకాంత కౌగిలి నుంచి కొంత విడి వడి మట్టి పాత్ర నుంచి అందించే నీటిధారను -శరత్కాల చంద్రుడి వెన్నెలలో ఎవడైతే తాగడో వాడు అదృష్ట హీనుడంటూ ఒక్క శ్లోకంలో అద్భుతంగా వర్ణించాడు. చివర శిశిర ఋతువును రెండు శ్లోకాలలో వర్ణిస్తూ శిశిర ఋతువే పవనుడై అతివేగంగా వీస్తూ స్త్రీల కేశాలను చిందరవందర చేస్తూ, వస్త్రాలను ఈడ్చేస్తూ, పెదవులు కొరుక్కునేలా చేస్తూ భర్తల వలెనే సంచరిస్తున్నాడని చెప్తాడు. ఇట్లా భర్తృహరి నాటి సమాజ శృంగార జీవనాన్ని చెప్తూ శృంగారంలోని అతిని వర్జిస్తూ 'శృంగార శతకాన్ని' రచించాడు. ఇక హేమంత ఋతువును రెండు శ్లోకాలలో వర్ణిస్తూ పెరుగు, నెయ్యిలను కలిపి సుష్టుగా భుజించినవాడు, భార్యల బిగి కౌగిళ్ళలో ఉన్నవారు, తాంబూలం నమలి ఇళ్ల లోలోపలి గదుల్లో స్త్రీ పురుషులు సుఖంగా నిద్రిస్తున్నారంటాడు భర్తృహరి. తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా%ౌ% తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి

## ఓవైపు వర్షాల లోటు.. మరోవైపు భారీ వర్షాల హెచ్చరిక




తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని పది జిల్లాల్లో వర్షపాత లోటు ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు రానున్న రెండు రోజుల్లో ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ విడుదల చేసిన సూచనల ప్రకారం వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రాబోయే 24 గంటల్లో అల్పపీడనంగా బలపడే అవకాశం ఉంది. దీనికితోడు రుతుపవన ద్రోణి కూడా చురుకుగా కొనసాగుతోంది. ఈ రెండింటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేశారు. ఇదిలావుండగా, ఆగస్టు చివరి వారానికి చేరుకున్నా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాల జాడ కరవైంది. రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ నెల 18 నాటికి రాష్ట్ర సగటు వర్షపాతం సాధారణం కంటే 14 శాతం అధికంగా ఉండగా, గత వారం రోజులుగా వర్షాలు తగ్గడంతో సోమవారం నాటికి 9 శాతం లోటులోకి పడిపోయింది. అత్యధికంగా నిర్మల్ జిల్లాలో 44 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, పెద్దపల్లిలో 21 శాతం, జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ జిల్లాల్లో 13 శాతం చొప్పున లోటు కొనసాగుతోంది. గత ఐదు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కూడా స్వల్పంగా పెరిగాయి.

## బల్గేరియా బాటలోనే మరో యూరప్ దేశం

# భారతీయులకు ఆఫర్

**యూరప్‌లో నివాసం కోసం భారతీయులను ఆకర్షిస్తున్న గ్రీస్ గోల్డెన్ వీసా పథకం**

**ప్రధాన నగరాల్లో 8 లక్షల యూరోలకు (దాదాపు రూ.7 కోట్లు) పెరిగిన కనీస పెట్టుబడి**

**ఒక్క వీసాతో 29 షెంజెన్ దేశాల్లో వీసా లేకుండా ప్రయాణించే సౌకర్యం**

**వీసా పొందిన వారి కుటుంబ సభ్యులకు కూడా వర్తించే నివాస హక్కు**

**ఏడేళ్ల తర్వాత గ్రీక్ పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునే అద్భుత అవకాశం**

**గత ఏడాది గ్రీస్ ఆస్తుల కొనుగోళ్లలో భారతీయుల పెట్టుబడుల్లో భారీ పెరుగుదల**



యూరప్‌లో స్థిరపడాలని, అక్కడి దేశాల్లో స్వేచ్ఛగా ప్రయాణించాలని ఆశించే సంపన్నులకు ఇటీవలే బల్గేరియా దేశం బంపర్ ఆఫర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే బాటలో గ్రీస్ దేశం ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోంది. యూరప్‌లోని అందమైన దేశం గ్రీస్‌లో నివసించాలని, వ్యాపారం చేయాలని కలలు కనే భారతీయులకు ఇది ఒక అద్భుతమైన అవకాశం అనే చెప్పాలి. గ్రీస్ ప్రభుత్వం అందిస్తున్న "గోల్డెన్ వీసా" కార్యక్రమం ద్వారా పెట్టుబడి పెట్టి, ఆ దేశంలో దీర్ఘకాలిక నివాస హక్కులను పొందవచ్చు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు భారతీయులకు కూడా అనుమతి ఉంది.

**పథకం వివరాలు**

2013లో ప్రారంభమైన ఈ గోల్డెన్ వీసా అనేది పెట్టుబడి ద్వారా నివాసాన్ని పొందే కార్యక్రమం. ఐరోపా సమాఖ్య (%జుఖ%) వెలుపలి దేశాల పౌరులు గ్రీస్‌లో నిర్దిష్ట మొత్తంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఐదేళ్ల కాలపరిమితితో కూడిన రెసిడెన్స్ పర్మిట్‌ను పొందవచ్చు. ఈ పర్మిట్‌ను ప్రతి ఐదేళ్లకోసారి పునరుద్ధరించుకునే సౌలభ్యం కూడా ఉంది. ఈ వీసా పొందిన వారు తమ కుటుంబ సభ్యులతో (భార్య/భర్త, 21 ఏళ్లలోపు పిల్లలు) కలిసి గ్రీస్‌లో నివసించవచ్చు, చదువుకోవచ్చు, సొంతంగా వ్యాపారం కూడా చేసుకోవచ్చు.

**ప్రధాన ప్రయోజనాలు**

ఈ వీసా ద్వారా గ్రీస్‌లోనే కాకుండా, ఇతర షెంజెన్ దేశాల్లోనూ 180 రోజుల వ్యవధిలో 90 రోజుల వరకు వీసా లేకుండా స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు. వీసాను కొనసాగించడానికి గ్రీస్‌లో తప్పనిసరిగా నివసించాలన్న నిబంధన లేకపోవడం భారతీయులకు ఒక ముఖ్యమైన ప్రయోజనం. దీనివల్ల వారు తమ ప్రధాన నివాసాన్ని ఇండియాలోనే కొనసాగిస్తూ, ఐరోపాలో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. అంతేకాకుండా, వీసాదారులు గ్రీక్ పౌరుల మాదిరిగానే ప్రభుత్వ విద్య, వైద్య సేవలను పొందేందుకు అర్హులు. ఏడేళ్ల పాటు గ్రీస్‌లో నివసించిన తర్వాత గ్రీక్ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే మార్గం కూడా సుగమం అవుతుంది.

**పెట్టుబడి మార్గాలు**

గోల్డెన్ వీసా కోసం పలు పెట్టుబడి మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

రియల్ ఎస్టేట్ రంగంలో కనీసం 250,000 యూరోలు (సుమారు రూ. 2.56 కోట్లు) పెట్టుబడి పెట్టవచ్చు. ఏథెన్స్, శాంటోరిని వంటి అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో ఈ పరిమితి 500,000 యూరోలుగా ఉంది.

గ్రీక్ కంపెనీలో కనీసం 500,000 యూరోల మూలధన సహకారం అందించవచ్చు లేదా అక్కడి బ్యాంకులో అంతే మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు.

గ్రీక్ ప్రభుత్వ బాండ్లలో 500,000 యూరోలు లేదా అక్కడి స్టాక్ మార్కెట్లలో ట్రేడ్ అయ్యే షేర్లు, కార్పొరేట్ బాండ్లలో 800,000 యూరోలు పెట్టుబడిగా పెట్టవచ్చు.

కొత్తగా ప్రతిపాదించిన నిబంధన ప్రకారం గ్రీక్ స్టార్టప్‌లలో కనీసం 250,000 యూరోల పెట్టుబడితో కూడా ఈ వీసాకు అర్హత సాధించవచ్చు.

**దరఖాస్తు ప్రక్రియ**

ముందుగా అర్హత ఉన్న పెట్టుబడి మార్గాన్ని ఎంచుకుని, లావాదేవీని పూర్తి చేయాలి. అనంతరం అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని, దరఖాస్తును ఇమ్మిగ్రేషన్ విభాగానికి సమర్పించాలి. ప్రధాన దరఖాస్తుదారునికి 2000 యూరోలు, కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 150 యూరోల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ వివరాలు అందించిన తర్వాత దరఖాస్తు ఆమోదానికి సాధారణంగా 6 నుంచి 12 నెలల సమయం పడుతుంది. ఆమోదం లభించిన వెంటనే రెసిడెన్స్ పర్మిట్ జారీ చేయబడుతుంది.

# రోజూ పెరుగు ఆరోగ్యం మెరుగు



మన రోజువారీ ఆహారంలో అనాదిగా వాడుకలో ఉన్న పాల ఉత్పత్తి పెరుగు. ఇంట్లో తోడుపెట్టుకుని తయారు చేసుకున్న పెరుగుతో శరీరానికి ఒనగూరే ప్రయోజనాలు ఎన్నో. అంతేకాదు, చర్మం, వెంట్రుకల ఆరోగ్యానికి పెరుగు గొప్ప ఉపకారి. పెరుగు రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. ఎముకలు, దంతాలను పటిష్ఠం చేస్తుంది. శరీర బరువు సమతూకంలో ఉండటానికి రోజువారీ ఆహారంలో పెరుగును భాగం చేసుకుంటే మంచిది. పాల నుంచి వచ్చే ఉప ఉత్పత్తి పెరుగు. కాబట్టి, ఇందులో కాల్షియం, విటమిన్ బి-2, విటమిన్ బి-12, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఎన్నో అత్యవసరమైన పోషకాలు ఉంటాయి. పైగా పాలకంటే కూడా సులువుగా అరిగిపోతుంది. సజీవ బ్యాక్టీరియా సమృద్ధంగా ఉండే పెరుగు గొప్ప ప్రొబయోటిక్ ఆహారం. ఇది మంచి బ్యాక్టీరియా కావడంతో పేగుల పనితీరు మెరుగుపడటానికి, మంటగా ఉన్న జీర్ణవ్యవస్థ చల్లబడటానికి, గడబిడగా ఉన్న కడుపును శాంతపరచడానికి ఎంతో ఉపకరిస్తుంది. పెరుగులో ఉండే సజీవ బ్యాక్టీరియా వ్యాధికారక క్రిములతో పోరాడుతుంది. అలా పొట్ట ఆరోగ్యానికి హామీగా ఉంటుంది. పెరుగు చర్మంపై మాయిశ్చరైజింగ్ ప్రభావాన్ని చూపిస్తుంది. పొడిబారిన చర్మానికి సహజసిద్ధంగా తేమనిస్తుంది. పొటాషియం, మెగ్నీషియం లాంటి పోషకాలు సహా పెరుగులో ఉండే ప్రత్యేకమైన ప్రొటీన్లు అధిక రక్తపోటును తగ్గించడంలో సాయపడతాయి. గుండె ఆరోగ్యానికి భరోసాను ఇస్తాయి. శరీర బరువును తగ్గించుకునేందుకు పెరుగు రెండు విధాలుగా ఉపకరిస్తుంది. ఒకటి, రక్తంలో పేరుకుపోయిన కార్టిసోల్ స్థాయిని తగ్గిస్తుంది. మన శరీరంలో పొట్ట, గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోయేలా చేసే హార్మోన్ కార్టిసోల్. రెండోది, మనకు జంక్ ఫుడ్ అంటే ఉవ్విళ్లూరడాన్ని తగ్గిస్తుంది. అలా మన డైట్‌పై దృష్టి సారించేలా చేస్తుంది. పెరుగులో కాల్షియం, ఫాస్ఫరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన దంతాలు, ఎముకలు దృఢంగా ఉండటానికి దోహదపడతాయి. పెరుగులో లాక్టిక్ ఆమ్లం ఉంటుంది. ఇది ఫంగస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. కాబట్టి, పెరుగును హెన్నాతో కలిపి మాడుకు పట్టిస్తే చుండ్రును అరికట్టవచ్చు. అంతేకాదు పెరుగు హెయిర్ కండిషనర్‌గా కూడా పనిచేస్తుంది. విటమిన్లు, ఖనిజ లవణాలు పెరుగులో పుష్కలం. అలా ఇది మనకు తేలిగ్గా దొరికే మంచి శక్తి వనరు. పైగా యాంటి ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోజువారీ పనిభారం నుంచి త్వరగా తేరుకునేందుకు ఉపకరిస్తుంది. తాజా పండ్లు, లేదంటే అవిసె గింజలు, పొద్దుతిరుగుడు గింజలను కలిపిన ఒక కప్పు పెరుగు మనకు మరింత ఫైబర్, ఇతర పోషకాలను అందిస్తుంది. పండ్లు, తరిగిన ఉల్లిపాయలు, టమాటాలు, స్మూతీలలో కలపడం, కూరలకు మంచి రంగు వచ్చేలా చేయడానికి, రోజువారీ ఉపాహారాన్ని సంపూర్ణం చేసుకోవడానికి పెరుగు మంచి ఆహార పదార్థం.

# ఆసక్తికర జాబ్ నోటిఫికేషన్
# స్క్రోలింగ్ చేయడమే ప్రధాన అర్హత!

**సోషల్ మీడియాలో మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ కో ఫౌండర్ విరాజ్ శేత్ పోస్ట్ వైరల్**

**డూమ్ స్క్రోలర్ పేరుతో ఉద్యోగ ప్రకటన**

**సోషల్ మీడియాలో గంటల తరబడి గడిపే యువతకు గుడ్ న్యూస్**



సోషల్ మీడియాలో గంటల తరబడి స్క్రోల్ చేస్తూ గడిపే యువతకు ఇది ఓ శుభవార్త. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటివాటిలో ఎక్కువ సమయం గడిపే వాళ్లకోసం ప్రత్యేకంగా ఒక ఉద్యోగ ప్రకటన విడుదలైంది. మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ కో-ఫౌండర్ మరియు సీఈఓ విరాజ్ శేత్ చేసిన ఈ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఉద్యోగానికి 'డూమ్-స్క్రోలర్' అనే పేరు పెట్టారు. రోజు కనీసం ఆరు గంటలు సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో స్క్రోల్ చేసే నైపుణ్యం ఉండాలి. కేవలం అలవాటుగా కాకుండా, ట్రెండ్స్‌ను అర్థం చేసుకునే దక్షత ఉండాలని విరాజ్ శేత్ పేర్కొన్నారు.

**అర్హతలు:**

హిందీ, ఇంగ్లీష్ భాషల్లో నైపుణ్యం తప్పనిసరి

సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్ పట్ల ఆసక్తి మరియు అవగాహన

క్రియేటర్ కల్చర్ పట్ల అంకితభావం

మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ వాడగలగాలి

ఉద్యోగం ముంబైలో ఉంటుందిబీ ఫుల్ టైం విధానంలో పనిచేయాలి

ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ పోస్టుపై నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తున్నారు. "ఇన్‌స్టాలో సమయం వృధా చేస్తున్నాననుకున్నా, ఇప్పుడు అదే స్కిల్!" అంటూ కొందరు కామెంట్ చేయగా, "నేను 19 గంటలు స్క్రోల్ చేస్తా, ఈ ఉద్యోగానికి పర్ఫెక్ట్ కాదా?" అంటూ మరికొందరు స్పందిస్తున్నారు. ఇంకొందరు అయితే "ఇది మా అమ్మకి చూపించాలి, స్క్రోలింగ్ కూడా ప్రొఫెషన్ అవుతుంది!" అంటూ సరదాగా రిప్లై ఇస్తున్నారు.

# సామాన్యుడు చేతిలో చిల్లిగవ్వ ఉండదు

## ఇరాన్ యుద్ధంతో ప్రపంచానికి పొంచి ఉన్నఆర్థిక ముప్పు



ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సామాన్యుడి ఆర్థిక జీవితాన్ని ఎలా అతలాకుతలం చేయబోతున్నాయో ఇంటర్నేషనల్ విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ యుద్ధం క్షిపణుల కంటే ఎక్కువగా మనుషుల జేబులపై, ఉద్యోగాలపై, రోజువారీ అవసరాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.ముఖ్యంగా ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభించే ప్రమాదం పొంచి ఉందని వాషింగ్టన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. చమురు, సహజ వాయువు సరఫరాకు ముప్పు వాటిల్లిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయి. ఇది రవాణా ఖర్చులను పెంచి తద్వారా పాలు, కూరగాయలు, మందుల వంటి నిత్యావసర వస్తువుల ధరలను సామాన్యుడికి అందనంత ఎత్తుకు తీసుకెళ్తుంది. అంటే, ప్రజల ఆదాయం పెరగకపోయినా, ఖర్చులు మాత్రం ఊహించని రీతిలో భారమవుతాయి.ప్రస్తుత తరుణంలో ప్రపంచం 'స్టాగ్ఫ్లేషన్' అనే అత్యంత ప్రమాదకరమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకునే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోర్ముజ్ జలసంధిని పాక్షికంగా మూసివేసినా ద్రవ్యోల్బణం మరో 2.5 శాతం వరకు పెరగవచ్చు. ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉండి, ఆర్థిక వృద్ధి కుంటుపడటాన్ని స్టాగ్ఫ్లేషన్ అంటారు. ఇటువంటి సమయంలో కంపెనీలు కొత్త నియామకాలను నిలిపివేస్తాయి. జీతాల పెంపు ఉండదు, నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుంది.ఆదాయ వనరులు తగ్గిపోయి, వస్తువుల ధరలు పెరగడం అనేది సామాన్యుడి పాలిట శాపంగా మారుతుంది. దీనికి తోడు, హోర్ముజ్ జలసంధి గుండా కేవలం చమురు మాత్రమే కాకుండా ఎరువులు, సల్ఫర్, హీలియం వంటి పెట్రోకెమికల్స్ కూడా రవాణా అవుతాయి. ఈ మార్గం మూతపడితే వ్యవసాయ ఖర్చులు, ఫ్యాక్టరీ ఉత్పత్తి వ్యయం పెరిగి, ఆర్థిక వ్యవస్థపై రెండో దశ ద్రవ్యోల్బణ దాడి మొదలవుతుంది.ఆసియా ఖండంలోని భారతదేశం, చైనా, జపాన్ వంటి దేశాలు చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. సరఫరాలో అంతరాయం ఏర్పడితే రిఫైనరీల ఉత్పత్తి క్షీణించి, దేశీయంగా ఇంధన కొరత ఏర్పడుతుంది. ఇది కేవలం పెట్రోల్ ధరలకే పరిమితం కాకుండా విమాన ప్రయాణాలు, ఆన్‌లైన్ డెలివరీలు, పారిశ్రామిక ఉత్పత్తుల ధరలపై నేరుగా ప్రభావం చూపుతుంది.మరోవైపు, ఈ అనిశ్చితి వల్ల కేంద్ర బ్యాంకులు కూడా వడ్డీ రేట్ల విషయంలో ఒక స్పష్టమైన నిర్ణయానికి రాలేక ఇబ్బంది పడుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి వడ్డీ రేట్లు పెంచితే వృద్ధి దెబ్బతింటుంది. తగ్గించడానికేమో ధరలు అదుపులో లేవు. ఫలితంగా గృహ రుణాలు, కార్ లోన్లు మరియు వ్యాపార రుణాల ఈఎంఐలు భారంగానే మిగిలిపోయే అవకాశం ఉంది.స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నప్పటికీ, ఈ ప్రశాంతత కేవలం తాత్కాలికమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా ఓడలు ఇంకా మార్గంలోనే ఉండటం వల్ల సరఫరా అంతరాయాల అసలు ప్రభావం కొన్ని వారాల తర్వాత మాత్రమే బయటపడుతుంది. అప్పుడు మార్కెట్లు అకస్మాత్తుగా పతనమయ్యే ప్రమాదం ఉంది. యుద్ధం వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్నప్పటికీ, దాని ప్రభావం మాత్రం మన వంటగది వరకు చేరుతుంది.వంటగ్యాస్ ధరలు, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల పెరుగుదల వల్ల సామాన్యుడి జీవన ప్రమాణాలు దెబ్బతింటాయి. ముగింపులో చెప్పాలంటే, ఈ యుద్ధం కేవలం సైనిక చర్య మాత్రమే కాదు; ఇది ప్రపంచ ప్రజల ఆర్థిక వ్యవస్థపై జరుగుతున్న దాడి. త్వరగా పరిష్కారం దొరకకపోతే, ఈ సంక్షోభం టీవీ వార్తల నుండి నేరుగా మన నిత్య జీవితాల్లోకి ప్రవేశించి తీరుతుంది.

# అమెరికా రాడార్లకు దొరకని చైనా విమానాలు



## రహస్యంగా ఇరాన్ గూటికి చేరడంతో వణుకుతున్న అగ్రరాజ్యం

మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం ఇప్పుడు అంతర్జాతీయ దౌత్యానికి పెను సవాలుగా మారింది. అమెరికా సీక్రెట్ ఏజెన్సీలు తాజాగా చైనాపై చేసిన ఆరోపణలు ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. ఇరాన్‌కు చైనా పరోక్షంగా ఆయుధ సంపత్తిని, ముఖ్యంగా 'మ్యాన్‌పాడ్' వంటి అత్యాధునిక రక్షణ పరికరాలను సరఫరా చేస్తోందని అమెరికా నిఘా వర్గాలు భావిస్తున్నాయి. భుజంపై ఉంచుకుని ప్రయోగించగలిగే ఈ క్షిపణులు శత్రువుల డ్రోన్లు, హెలికాప్టర్లను క్షణాల్లో నేలమట్టం చేయగలవు.ఇరాన్ తన గగనతల రక్షణను బలోపేతం చేసుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే, చైనా ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. తాము ఒక బాధ్యతాయుతమైన దేశమని, యుద్ధాన్ని ప్రోత్సహించే చర్యలకు తాము ఎప్పుడూ దూరంగానే ఉంటామని స్పష్టం చేసింది. అయినప్పటికీ, తాజాగా వెలుగులోకి వచ్చిన 'డార్క్ ఫ్లైట్స్' ఉదంతం అమెరికా అనుమానాలకు బలం చేకూర్చుతోంది.కేవలం 48 గంటల వ్యవధిలో నాలుగు చైనా కార్గో విమానాలు తమ ట్రాన్స్‌పాండర్లను ఆపివేసి రాడార్లకు చిక్కకుండా ప్రయాణించడం అంతర్జాతీయ రక్షణ వర్గాల్లో కలకలం రేపింది.సాధారణంగా విమానం వేగం, ఎత్తు, మార్గాన్ని సూచించే ట్రాన్స్‌పాండర్‌ను ఉద్దేశపూర్వకంగా ఆపివేయడాన్ని నిఘా పరిభాషలో 'డార్క్ ఫ్లైట్' అని పిలుస్తారు. ఇటువంటి పద్ధతులను అత్యంత రహస్యమైన సైనిక కార్యకలాపాలు లేదా సున్నితమైన లావాదేవీల సమయంలోనే ఉపయోగిస్తారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాల ప్రకారం.. ఈ విమానాలు ఇరాన్‌కు అవసరమైన మందుగుండు సామాగ్రిని, ఇతర యుద్ధ పరికరాలను చేరవేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఒకవేళ ఇవే నిజమైతే, సైనిక సామర్థ్యం పెరగడమే కాకుండా, అమెరికాకు ఆ ప్రాంతంలో ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. చైనా ఈ వార్తలను కొట్టిపారేసినప్పటికీ, అమెరికా ఏజెన్సీలు మాత్రం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య సంబంధాలు అత్యంత దారుణంగా దెబ్బతిన్నాయి. ఇటీవల ఇస్లామాబాద్‌లో జరిగిన దౌత్యపరమైన చర్చలు ఎటువంటి ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.ఈ చర్చల వైఫల్యం తర్వాత ఇరు దేశాలు మళ్లీ చర్చలకు ప్రయత్నిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు మాత్రం యుద్ధ మేఘాలను సూచిస్తున్నాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామన్న ఇరాన్ హెచ్చరికలు ఒకవైపు, చైనా నుంచి అందుతున్నాయని చెబుతున్న ఆయుధ సహాయం మరోవైపు అమెరికాను ఆత్మరక్షణలో పడేశాయి. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన జలసంధి మూతపడితే చమురు ధరలు ఆకాశాన్నంటుతాయని, తద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇరాన్‌కు రష్యా - చైనాల నుంచి అందుతున్న పరోక్ష మద్దతు, అమెరికా ఏకపక్ష ఆంక్షలకు వ్యతిరేకంగా ఒక కొత్త కూటమిని సృష్టిస్తోంది. చైనా తన ఆర్థిక ప్రయోజనాల కోసం, అమెరికా ప్రాబల్యాన్ని తగ్గించడం కోసం ఇరాన్‌ను ఒక పావుగా వాడుకుంటోందని పాశ్చాత్య దేశాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు, ఇరాన్ తన సార్వభౌమాధికారం కోసం పోరాడుతున్నామని, తమకు ఎవరి సహాయం అవసరం లేదని చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో అందుతున్న సాంకేతిక సహకారం వాస్తవాలను వేరేలా చూపుతోంది.ఈ ఆయుధాల తరలింపు వార్తలు నిజమైతే.. మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక వ్యూహాలను ఇరాన్ మరింత సమర్థవంతంగా ఎదుర్కోగలదు. చివరగా, ఈ అంతర్జాతీయ రాజకీయ చదరంగంలో చైనా కార్గో విమానాల అదృశ్యం అనేది ఒక చిన్న సంఘటనలా కనిపించినా, దాని వెనుక ఉన్న వ్యూహాలు భవిష్యత్తులో ప్రపంచ శాంతికి పెను ముప్పుగా మారే ప్రమాదం ఉంది. ఇరు దేశాల మధ్య తదుపరి దఫా చర్చలు విజయవంతం కాకపోతే, ఈ ఆయుధ ప్రదర్శనలు చివరకు ప్రత్యక్ష యుద్ధానికి దారితీసే అవకాశం కనిపిస్తోంది.

# బ్యాంకులు మీ లోన్ అప్లికేషన్‌ను ఎందుకు తిరస్కరిస్తున్నాయి

## అసలు గుట్టు విప్పిన ఆర్థిక నిపుణులు!




చాలా మంది తమ శాలరీ స్లిప్ చూసుకుని మురిసిపోతుంటారు. "నాకు నెలకు లక్షల్లో జీతం వస్తోంది, ఏదైనా బ్యాంక్‌లో పర్సనల్ లోన్ అడిగితే వెంటనే ఇచ్చేస్తారు" అని ధీమాగా ఉంటారు. కానీ, తీరా లోన్ కోసం అప్లై చేసినప్పుడు బ్యాంక్ ఆ అప్లికేషన్‌ను తిరస్కరిస్తుంది. అప్పుడు మనకు కలిగే సందేహం ఒక్కటే.. "అంత జీతం ఉన్నా నాకు లోన్ ఎందుకు ఇవ్వలేదు?" అని. నిజానికి బ్యాంకులు మీ జీతాన్ని మాత్రమే చూడవు, ఆ జీతంతో మీరు ఎలా బతుకుతున్నారు అనేది కూడా గమనిస్తాయి.సంపాదన ఎంత కాదు.. మిగిలేది ఎంతమీరు నెలకు లక్ష రూపాయలు సంపాదిస్తున్నారనుకుందాం. కానీ అందులో 80 వేలు ఇప్పటికే ఉన్న ఈఎంఐలు , ఇంటి అద్దె, క్రెడిట్ కార్డ్ బిల్లులు , ఇతర ఖర్చులకు పోతుంటే.. మీ దగ్గర మిగిలేది కేవలం 20 వేలే. కొత్తగా పర్సనల్ లోన్ ఇస్తే దానికి ఈఎంఐ కట్టే స్తోమత మీకు ఉందా లేదా అని బ్యాంక్ లెక్కగడుతుంది. మీ దగ్గర 'అందుబాటులో ఉన్న ఆదాయం' తక్కువగా ఉంటే, మీ జీతం ఎంత ఎక్కువగా ఉన్నా లోన్ రావడం కష్టమే.గత ప్రవర్తన.. మీ వెంటే ఉంటుంది!మీరు ఏడాది క్రితం ఏదైనా ఒక ఈఎంఐ కట్టడం మర్చిపోయారా? లేదా క్రెడిట్ కార్డ్ బిల్లును లేటుగా చెల్లించారా? మనకు ఇది చిన్న విషయంగా అనిపించవచ్చు. కానీ బ్యాంకుల దృష్టిలో ఇది మీ ఆర్థిక క్రమశిక్షణను సూచిస్తుంది. మీ జీతం ఈరోజు బాగుండవచ్చు, కానీ గతంలో మీరు అప్పులు ఎలా తీర్చారు అనే హిస్టరీని బ్యాంకులు క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. ఆ పాత చిన్న తప్పులే ఇప్పుడు మీ లోన్ రిజెక్ట్ అవ్వడానికి ప్రధాన కారణం కావచ్చు.క్రెడిట్ కార్డ్ లిమిట్ మొత్తం వాడుతున్నారామీకు క్రెడిట్ కార్డ్ ఉంది, మీరు దాని బిల్లులు కరెక్ట్‌గా కడుతున్నారు.. అంతా బాగుంది. కానీ, మీ కార్డుకున్న లిమిట్‌లో 80-90% ప్రతి నెలా వాడేస్తున్నారా? అయితే మీరు పూర్తిగా అప్పుల మీద ఆధారపడి జీవిస్తున్నారని బ్యాంక్ భావిస్తుంది. దీనినే 'క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో' అంటారు. ఇది ఎక్కువగా ఉంటే కొత్తగా మీకు లోన్ ఇవ్వడానికి బ్యాంకులు వెనుకాడతాయి.పదే పదే జాబ్ మారుతున్నారాబ్యాంకులకు ఆదాయం కంటే 'స్థిరత్వం' ముఖ్యం. మీరు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంపెనీలు మారుస్తుంటే.. మీకు ఆదాయం స్థిరంగా వస్తుందని బ్యాంక్ నమ్మదు. అలాగే, మీరు పని చేసే రంగంలో అనిశ్చితి ఉన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడానికి భయపడతాయి.ఒకేసారి అన్ని చోట్లా ట్రై చేస్తున్నారాఒక బ్యాంకులో లోన్ రిజెక్ట్ అవ్వగానే వెంటనే మరో మూడు నాలుగు బ్యాంకుల వెబ్‌సైట్లకు వెళ్లి అప్లై చేయడం పెద్ద తప్పు. మీరు ఎన్నిసార్లు లోన్ కోసం ఎంక్వైరీ చేసినా అది మీ క్రెడిట్ రిపోర్టులో కనిపిస్తుంది. మీరు అప్పు కోసం ఆత్రుతగా వెతుకుతున్నారని అనిపిస్తే, బ్యాంకులు తమ రిస్క్ తగ్గించుకోవడానికి మీ లోన్ అప్లికేషన్‌ను రిజెక్ట్ చేస్తాయి.శాలరీ ఒక్కటే సరిపోదు!మీ జీతం అనేది లోన్ పొందేందుకు ఒక ద్వారం లాంటిది మాత్రమే. కానీ ఆ ద్వారం దాటి లోపలికి వెళ్లాలంటే మీకు మంచి క్రెడిట్ స్కోరు, స్థిరమైన ఉద్యోగం , అప్పులను మేనేజ్ చేసే సామర్థ్యం ఉండాలి. కాబట్టి, లోన్ కోసం అప్లై చేసే ముందు మీ పాత బాకీలు తీర్చడం, సిబిల్ స్కోరును మెరుగుపరుచుకోవడం వంటివి చేస్తే.. మీ శాలరీకి తగినట్లుగా సులభంగా లోన్ లభిస్తుంది. కేవలం సంపాదన పెంచుకోవడం మాత్రమే కాదు, దాన్ని ఎలా ఖర్చు చేస్తున్నామనేది కూడా ఇక్కడ చాలా ముఖ్యం.

# డేట్ ఆఫ్ బర్త్ మార్చుకోవాలా ఈ సింపుల్ స్టెప్స్ ఫాలో అవ్వండి!




నేటి కాలంలో చిన్న పని నుంచి పెద్ద పని వరకు ఆధార్ కార్డు లేనిదే ఏదీ జరగడం లేదు. పిల్లల స్కూల్ అడ్మిషన్ల దగ్గర నుంచి పాన్ కార్డు, రేషన్ కార్డు అనుసంధానం వరకు ప్రతిచోటా ఆధార్ వివరాలు కచ్చితంగా ఉండాలి. ఒకవేళ మీ ఆధార్‌లో పేరు, అడ్రస్ లేదా పుట్టిన తేదీ తప్పుగా ఉంటే.. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు పొందడంలో ఇబ్బందులు రావచ్చు. అందుకే, మీ ఆధార్ అప్ డేట్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవడం చాలా ముఖ్యం.ఆధార్ లో పుట్టిన తేదీని మార్చుకోవడం ఎలాచాలామంది ఆధార్‌లో వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే పూర్తిగా మార్చుకోవచ్చని అనుకుంటారు. కానీ, ప్రస్తుతం నేరుగా ఆన్‌లైన్ ద్వారా పుట్టిన తేదీని మార్చే సదుపాయం అందుబాటులో లేదు. అయితే, మీరు మీ పనిని సులభతరం చేయడానికి అవసరమైన ఫామ్‌ను ఆన్‌లైన్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ ప్రాసెస్ ఇక్కడ ఉంది..స్టెప్ 1: ముందుగా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి.స్టెప్ 2: వెబ్‌సైట్‌లో లాగిన్ అయి 'ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ , అప్‌డేట్ ఫామ్' డౌన్‌లోడ్ చేసుకోండి.స్టెప్ 3: ఈ ఫామ్‌ను ప్రింట్ తీసుకుని, మీ దగ్గరలోని ఆధార్ సేవా కేంద్రానికి వెళ్లాలి.స్టెప్ 4: ఫామ్‌లో మీ సరైన పుట్టిన తేదీ , ఇతర వివరాలను తప్పులు లేకుండా నింపండి.స్టెప్ 5: ఫామ్‌తో పాటు మీ పుట్టిన తేదీని ధృవీకరించే ఒరిజినల్ డాక్యుమెంట్లను (ఉదాహరణకు: బర్త్ సర్టిఫికేట్ లేదా మార్క్స్ మెమో) సమర్పించాలి.స్టెప్ 6: అక్కడ ఉన్న అధికారి మీ పత్రాలను స్కాన్ చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తానికి మీరు 75 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.ఎన్నిసార్లు మార్చుకోవచ్చుఆధార్‌లో వివరాలను మార్చుకోవడానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. పేరును సాధారణంగా రెండుసార్లు, పుట్టిన తేదీని కేవలం ఒకే ఒక్కసారి మాత్రమే మార్చుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ మీరు ఈ పరిమితి దాటిన తర్వాత కూడా మార్చాలని అనుకుంటే, అది చాలా కఠినమైన తనిఖీలకు గురవుతుంది. దీని కోసం ఒక ప్రత్యేక 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' ను రూపొందించింది. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.ఆధార్ అప్‌డేట్ ఎందుకు ముఖ్యం మీ ఆధార్, పాన్ , రేషన్ కార్డులలో వివరాలు ఒకేలా ఉండాలి. పుట్టిన తేదీలో చిన్న తేడా ఉన్నా బ్యాంక్ అకౌంట్ తెరవడానికి లేదా పాస్‌పోర్ట్ దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే, మీ ఆధార్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచుకోవడం మీ బాధ్యత.ఆధార్ అనేది మన గుర్తింపు కార్డు మాత్రమే కాదు, అది మన ఆర్థిక లావాదేవీలకు పునాది. కాబట్టి, ఎటువంటి తప్పులున్నా వెంటనే సరిదిద్దుకోండి. పైన చెప్పిన పద్ధతిలో ఫామ్ నింపి దగ్గరలోని ఆధార్ కేంద్రానికి వెళ్తే మీ ఆధార్ అప్ డేట్ పని సులభంగా పూర్తవుతుంది. ముఖ్యంగా డాక్యుమెంట్లు తీసుకువెళ్లేటప్పుడు అవి చెల్లుబాటు అయ్యేవి అవునో కాదో ఒకసారి వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోండి.

# కాలంతో పాటు స్ట్రాటెజీ కూడా మారాలి!


## మీ పోర్ట్‌ఫోలియోలో బంగారం ఎందుకు ఉండాలంటే



పెట్టుబడి రంగంలో అనేక మార్పులు వచ్చినప్పటికీ, ఒక వైవిధ్యమైన పోర్ట్ ఫోలియో లో బంగారం తన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంది. ఆర్థిక చక్రాలు మారినా, తరాలు గడిచినా బంగారం అనేది సంపదను భద్రపరిచే ఒక నమ్మకమైన సాధనంగా నిలుస్తోందని హెచ్‌ఎస్బీసీ మ్యూచువల్ ఫండ్ సీఈఓ కైలాష్ కులకర్ణి పేర్కొన్నారు.నేటి వేగంగా మారుతున్న ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడిదారులు కేవలం ఒకే రకమైన ఆస్తి పై ఆధారపడటం ప్రమాదకరం. అందుకే వైవిధ్యీకరణ అనేది పెట్టుబడి మౌలిక సూత్రంగా మారింది. ఈ క్రమంలో బంగారం అనేది ఒక ముఖ్యమైన భాగమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. బంగారం విలువ దాని కొరత, మన్నికపై ఆధారపడి ఉంటుంది, అందుకే ఇది దశాబ్దాలుగా తన ప్రాముఖ్యతను కోల్పోలేదు.రిస్క్ తగ్గించే 'డైవర్సిఫయర్'స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనైనప్పుడు లేదా అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పుడు బంగారం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. గత రెండు దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే, అనేక సంక్షోభ సమయాల్లో బంగారం సానుకూల ఫలితాలను ఇచ్చింది. ఉదాహరణకు, 2020లో కరోనా లాక్డౌన్ సమయంలో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలినా, బంగారం మాత్రం 28 శాతం రాబడిని ఇచ్చి ఇన్వెస్టర్లను ఆదుకుంది. పోర్ట్‌ఫోలియోలో కొంత శాతం బంగారం ఉండటం వల్ల మొత్తం పెట్టుబడిపై రిస్క్ తగ్గుతుంది.మారుతున్న పెట్టుబడి పద్ధతులు: ఒకప్పుడు బంగారం అంటే కేవలం నగల రూపంలోనే భద్రపరచుకునేవారు. కానీ ఇప్పుడు గోల్డ్ ఈటీఎఫ్‌లు , గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ వంటి ఆర్థిక ఉత్పత్తుల ద్వారా చాలా పారదర్శకంగా పెట్టుబడి పెట్టవచ్చు. భౌతిక బంగారంతో వచ్చే స్టోరేజ్ సమస్యలు, తరుగు , మేకింగ్ ఛార్జీల భయం లేకుండా స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా వీటిని కొనుగోలు చేయవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఈటీఎఫ్ ల డిమాండ్ రికార్డు స్థాయికి చేరుకోవడం, ఇన్వెస్టర్లు డిజిటల్ బంగారం వైపు మళ్లుతున్నారని స్పష్టం చేస్తోంది.భారతదేశంలో పెరుగుతున్న అవగాహనప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని వినియోగించే దేశాల్లో భారత్ ఒకటి. అయితే ఇప్పుడు భారతీయులు కూడా కేవలం భౌతిక బంగారంపైనే కాకుండా, మ్యూచువల్ ఫండ్స్ , ఈటీఎఫ్‌ల ద్వారా పసిడిపై పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల అందుబాటు, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్‌పై అవగాహన పెరగడం వల్ల ఈ మార్పు కనిపిస్తోంది.పెట్టుబడిదారులకు సూచనఆధునిక పోర్ట్ ఫోలియో నిర్మాణంలో బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు, అది ఒక వ్యూహాత్మక ఆస్తి. మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నా, మీ మొత్తం పెట్టుబడిలో కొంత భాగాన్ని బంగారం కు కేటాయించడం వల్ల స్థిరత్వం లభిస్తుంది. దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలు చేసుకునే వారు ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ ఫండ్స్ ద్వారా క్రమబద్ధంగా పెట్టుబడి పెట్టడం ద్వారా గరిష్ట ప్రయోజనం పొందవచ్చు. బంగారం మీ సంపదకు భద్రతను ఇవ్వడమే కాకుండా, కష్టకాలంలో ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తిని ఇస్తుంది.

# మీ డబ్బుపై 8% లాభం కావాలా

## ఈ బ్యాంకుల్లో చేస్తే కాసుల వర్షమే!




మధ్యతరగతి వాళ్లు అలాగే సురక్షితమైన రాబడిని కోరుకునే ఇన్వెస్టర్లు నేటికీ ఫిక్స్‌డ్ డిపాజిట్స్ వడ్డీకే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా, నిర్ణీత కాలానికి గ్యారెంటీ రిటర్న్స్ ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టడం భారతీయుల అలవాటు. అయితే, అన్ని బ్యాంకులు ఒకే రకమైన వడ్డీని ఇవ్వవు. ఏప్రిల్ 2026 నాటి తాజా గణాంకాల ప్రకారం, ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే కొన్ని ప్రైవేట్, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు అత్యధిక వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి.స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల హవా!ప్రస్తుతం స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు తమ కస్టమర్లను ఆకట్టుకోవడానికి 8 శాతం వరకు వడ్డీని అందిస్తున్నాయి.సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్: అత్యధికంగా ఏడాదికి 8.10% వడ్డీని ఇస్తోంది. స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్: 8.00% వడ్డీతో గట్టి పోటీనిస్తోంది.శివాలిక్ , జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు: వరుసగా 7.80% , 7.77% వడ్డీని అందిస్తున్నాయి. మీరు రిస్క్ తీసుకోకుండా కొంచెం ఎక్కువ లాభం ఆశించే వారైతే, ఈ బ్యాంకులు మంచి ఆప్షన్ కావచ్చు.ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిస్థితిపెద్ద ప్రైవేట్ బ్యాంకులు సాధారణంగా 7% నుండి 7.25% మధ్య వడ్డీని ఆఫర్ చేస్తుండగా, ఎస్‌బిఎం బ్యాంక్ ఇండియా ఏకంగా 7.85% వడ్డీని ఇస్తోంది. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ 7.40% వడ్డీని అందిస్తోంది. ఇక నమ్మకానికి మారుపేరుగా భావించే ప్రభుత్వ రంగ బ్యాంకుల విషయానికి వస్తే, వడ్డీ రేట్లు కొంచెం తక్కువగా ఉన్నాయి. పంజాబ్ & సింద్ బ్యాంక్ 6.75% ఇస్తుండగా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, పీఎన్‌బీ వంటి బ్యాంకులు 6.60% నుండి 6.65% మధ్య వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. విదేశీ బ్యాంకుల్లో డ్యుయిష్ బ్యాంక్ 7% వడ్డీతో మెరుగైన స్థానంలో ఉంది.కేవలం వడ్డీ రేటే కాదు.. ఇవి కూడా గమనించండి!కేవలం వడ్డీ రేటు ఎక్కువగా ఉందని కళ్లు మూసుకుని ఇన్వెస్ట్ చేయకండి. మీరు డిపాజిట్ చేసే ముందు సదరు బ్యాంకు యొక్క భద్రత , అవసరమైనప్పుడు డబ్బును వెనక్కి తీసుకునే వెసులుబాటు , మెచ్యూరిటీ కంటే ముందే డబ్బు విత్ డ్రా చేస్తే పడే పెనాల్టీల గురించి కూడా ఆరా తీయాలి. సాధారణంగా 1 నుండి 5 ఏళ్ల కాలపరిమితి గల డిపాజిట్లకు ఎక్కువ డిమాండ్ ఉంటోంది.సరైన నిర్ణయమే మీ సంపద!మీరు కష్టపడి సంపాదించిన డబ్బును ఎక్కడ డిపాజిట్ చేయాలనేది మీ ఆర్థిక లక్ష్యాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న వడ్డీ రేట్లు ను బట్టి చూస్తే, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు అత్యుత్తమ రాబడిని ఇస్తున్నాయి. అయితే, భారీ మొత్తంలో డిపాజిట్ చేసేటప్పుడు వివిధ బ్యాంకుల్లో విభజించి పెట్టుబడి పెట్టడం మంచిది. దీనివల్ల రిస్క్ తగ్గడమే కాకుండా, రాబడిని గరిష్టంగా పొందే అవకాశం ఉంటుంది. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత బ్యాంకు వెబ్‌సైట్ లేదా బ్రాంచ్‌కు వెళ్లి తాజా నిబంధనలను ఒకసారి సరిచూసుకోవడం మర్చిపోవద్దు.

# కోటి హెల్మెట్లు... భారత మార్కెట్‌లో 'స్టీల్‌బర్డ్' జోరు

## స్టీల్‌బర్డ్ హెల్మెట్లు కోటి యూనిట్ల అమ్మకాలు పూర్తి

## సరసమైన ధర, సర్టిఫికేషన్‌తో భారీ ప్రజాదరణ

## ఇది రైడర్ల నమ్మకానికి నిదర్శనమన్న స్టీల్‌బర్డ్ ఎండీ

## దేశవ్యాప్తంగా రిటైల్ షాపుల విస్తరణకు కంపెనీ ప్రణాళిక



ప్రముఖ హెల్మెట్ల తయారీ సంస్థ స్టీల్‌బర్డ్ హై-టెక్ ఇండియా, భారత మార్కెట్‌లో ఓ అరుదైన మైలురాయిని అందుకుంది. సంస్థకు చెందిన పాపులర్ సిరీస్ హెల్మెట్లు ఏకంగా 1 కోటి (10 మిలియన్) యూనిట్ల అమ్మకాలను పూర్తి చేశాయి. దేశంలో సరసమైన ధరలో లభించే సర్టిఫైడ్ హెల్మెట్లకు పెరుగుతున్న ఆదరణకు ఈ విజయం నిదర్శనంగా నిలుస్తోందికేవలం రూ. 969 ప్రారంభ ధరతో లభించడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం =ాఆ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. దీంతో రోజువారీ ప్రయాణికులు, యువ రైడర్లకు నాణ్యమైన భద్రత అందుబాటులోకి వచ్చింది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్టీల్‌బర్డ్ తన విస్తృతమైన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా ఈ హెల్మెట్లను ప్రజలకు చేరువ చేసింది.ఈ విజయంపై స్టీల్‌బర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కపూర్ హర్షం వ్యక్తం చేశారు. "కోటి హెల్మెట్ల అమ్మకాల మార్కును దాటడం మాపై లక్షలాది మంది రైడర్లు చూపిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. సర్టిఫైడ్ హెల్మెట్లను అందరికీ అందుబాటులోకి తెచ్చి, రోడ్డు భద్రతను పెంచే జాతీయ ప్రయత్నాలకు మేము మద్దతిస్తున్నందుకు గర్వంగా ఉంది" అని తెలిపారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200కి పైగా ఎక్స్‌క్లూజివ్ రైడర్ షాపులు నిర్వహిస్తున్న స్టీల్‌బర్డ్, వాటి సంఖ్యను 1,000కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అధునాతన ఫీచర్లతో కొత్త మోడళ్లను కూడా తీసుకురావడానికి కంపెనీ ప్రణాళికలు రచిస్తోంది. ఈ మైలురాయి, దేశంలో బాధ్యతాయుతమైన రైడింగ్ పట్ల పెరుగుతున్న సానుకూల దృక్పథాన్ని సూచిస్తోంది.



## స్పిరిట్‌లో సైలెంట్ వార్?

దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ నిర్మాణం జరుపుకుంటున్న పానిండియా చిత్రాల్లో ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రెస్టేజియస్ మూవీ కోసం అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పూర్తి కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ చూడనటువంటి రూత్‌లెస్ పోలీస్ అవతారంలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన ఎపిసోడ్‌ని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్నట్లు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ఎపిసోడ్‌లో యాక్షన్ కంటే సైలెన్స్‌తోనే సందీప్ భయపెట్టనున్నారట. ఆద్యంతం సీరియస్ డ్రామాగా ఈ సీక్వెన్స్ సాగుతుందని వినికిడి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నడిచే వార్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుందట. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న గ్రాండ్‌గా విడుదల కానున్నది.



## 'డ్రాగన్' గ్లింప్స్ రిలీజ్.. ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి పవర్‌ఫుల్ ట్రీట్

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూ.ఎన్టీఆర్ హీరోగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా గ్లింప్స్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. మే 20వ తేదీ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ మొత్తం సినిమా కంటెంట్ ఎలా ఉండబోతోందనే క్లారిటీ ఇచ్చేసినట్లు అయింది. 'సలార్', 'కేజీఎఫ్' లాంటి భారీ సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ నీల్, తన మార్క్ ఏమాత్రం తగ్గకుండానే ఈ గ్లింప్స్ కట్ చేశాడు. ఇక తారక్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాత్రి 11.30 గంటల తర్వాత డ్రాగన్ సినిమా గ్లింప్స్ వచ్చింది. 4.28 నిమిషాల నిడివి గల ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ స్లిమ్ లుక్ ఆకట్టుకుంది. సింపుల్‌గా సినిమా కథ, ఆ ప్రపంచంలోని పాత్రలను పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో తారక్ చెప్పిన డైలాగ్స్ అభిమానులను అలరించేలా ఉన్నాయి. విజువల్స్ చాలా రిచ్‌గా ఉన్నాయి. రవి బస్రూర్ అందించిన నేపథ్య సంగీతం ఫ్యాన్స్ అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. పవర్‌ఫుల్‌గా సాగిన ఈ గ్లింప్స్ సినిమా మీద భారీ అంచనాలను రేపుతోంది. కాగా డ్రాగన్ సినిమా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ షూటింగ్ షెడ్యూల్‌లు వరుసగా వాయిదాలు పడటంతో విడుదలను వాయిదాలు పడ్డ విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానున్నట్టు డ్రాగన్ టీమ్ అధికారికంగా ప్రకటించింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు కీలకమైన పాత్రలో అనిల్ కపూర్ నటిస్తున్నారు. కథను మలుపు తిప్పే మరో లీడ్ రోల్‌లో నటించనున్నారంటూ శ్రుతీహాసన్, రష్మికా మందన్నా, కాజోల్... వంటి వార్ల పేర్లు వినిపించాయి. తాజాగా ఆలియా భట్ పేరు తెరపైకి వచ్చింది. కాగా.. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా విడుదల చేసిన వీడియో గ్లింప్స్‌ను మీరు కూడా చూసేయండి.

## గ్రామీణ నేపథ్యంలో హైలెస్సో

సుడిగాలి సుధీర్‌గా పేరుపొందిన సుధీర్ ఆనంద్ కథానాయకుడిగా రూపొందుతున్న ఎమోషనల్ డ్రామా 'హైలెస్సో'. ప్రసన్నకుమార్ కోట దర్శకుడు. శివ చెర్రీ, రవికిరణ్ నిర్మాతలు. ప్రముఖ నటుడు శివాజీ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. మంగళవారం సుధీర్ పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రఫ్ లుక్‌లో, గంటలు కట్టిన ఖడ్గాన్ని చేతపట్టుకొని రక్తపు మరకలతో పవర్‌ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న సుడిగాలి సుధీర్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బలమైన ఎమోషన్స్ కూడా ఉంటాయని, సుధీర్ ఇప్పటివరకూ చేసిన పాత్రలకు పూర్తిభిన్నమైన పాత్రను ఇందులో పోషిస్తున్నారని, ఇప్పటికే హైదరాబాద్‌లో 25రోజుల షెడ్యూల్ పూర్తయిందని, త్వరలోనే ఏలూరులో 40రోజల భారీ షెడ్యూల్ ప్రారంభం కానున్నదని మేకర్స్ తెలిపారు. నటాషా సింగ్, నక్షా సరన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నటి అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, నిర్మాణం: వజ్ర వరాహి. సినిమాస్.



## నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.





## వేసవి నాటి జ్ఞాపకాల్లో..

చిన్ననాటి అందమైన జ్ఞాపకాలను గుర్తుకు తెస్తూ వినోదప్రధానంగా రూపొందిస్తున్న బాలల చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీకర్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం బాలనటి, 'మనశంకర వరప్రసాద్‌గారు' ఫేమ్ ఖుషి పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రతి ఒక్కరికి వేసవి సెలవుల్లోని బాల్య జ్ఞాపకాలను గుర్తుకు తెస్తూ ఆద్యంతం నాస్టాల్జిక్ ఫీల్‌తో సాగే సినిమా ఇదని, చక్కటి వినోదంతో అలరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సింజిత్ యెర్రమల్లి, నిర్మాణ సంస్థ: ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ, దర్శకత్వం: శ్రీకర్.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.